



# విజయభాను






హైదరాబాద్, మంగళవారం 24-10-2017 VIJAYABHANU DAILY HYDERABAD EDITION సంపుటి : 37 సంచిక : 40 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ప్రారంభం

హైదరాబాద్ : రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ప్రారంభమైంది. అసెంబ్లీలో ప్రవేశపెట్టాల్సిన 8 ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులకు ఈ సమావేశంలో ఆమోదం తెలుపనున్నారు. పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు ప్రతిపాదించే అవకాశం ఉన్నది. దాదాపు 65 అంశాలతో కూడిన భారీ ఎజెండాపై చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. వివిధ శాఖల్లో కొత్త పోస్టుల నియామకానికి కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న భూమి రికార్డుల ప్రక్షాళనపై సమగ్రంగా చర్చించనున్నారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు కోసం తీసుకున్న రుణానికి కూడా క్యాబినెట్ ఆమోదం తెలుపనున్నట్టు తెలిసింది. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. మంత్రులందరూ తమ శాఖలపై సమగ్ర సమాచారంతోపాటు పూర్తి అవగాహనతో ఉండాలని ఇప్పటికే సీఎం కేసీఆర్ సూచించినట్టు తెలిసింది. విపక్షాలు ఏ ప్రశ్న లేవనెత్తినా సమగ్ర సమాచారంతో సమాధానం ఇచ్చేలా ఉండాలని మంత్రులకు సీఎం కేసీఆర్ సూచించనున్నారు.



# 20 విమానాలు.. ఎక్స్‌ప్రెస్‌వేపై ల్యాండింగ్..



లక్నో: భారత వైమానిక దళానికి చెందిన విమానాలు రేపు ఉత్తరప్రదేశ్‌లో ఉన్న లక్నో-ఆగ్రా ఎక్స్‌ప్రెస్‌వేపై ల్యాండ్ కానున్నాయి. ఐఏఎఫ్ డ్రిల్స్‌లో భాగంగా ఈ విన్యాసాలను చేయనున్నారు. దేశంలోనే లక్నో-ఆగ్రా లేన్ హైవే అత్యంత పొడవైనది. ఇది 302 కిలోమీటర్లు ఉంటుంది.

ఐఏఎఫ్ ఫైటర్లతో పాటు ట్రాన్స్‌పోర్ట్ ప్లేన్లు కూడా ఈ ఈవెంట్‌లో పాల్గొన్నాయి. 16 యుద్ధ విమానాలు, నాలుగు రవాణా విమానాలు.. ఎక్స్‌ప్రెస్‌వేపై దిగనున్నాయి. ఫైటర్ ప్లేన్ల జాబితాలో సుఖోయ్ 30ఎంకేఐ, మిరాజ్, జాగ్వర్ ఉన్నాయి. ట్రాన్స్‌పోర్ట్ క్యాటగిరీలో.. ఏఎన్32, సీ130 హెర్క్యూల్స్ విమానాలు ఉన్నాయి. ఆపరేషనల్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా భారత వైమానిక దళం ఈ ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేస్తున్నది. ఉన్నావ్ జిల్లాలోని బంగెర్‌మావూ ప్రాంతంలో ఉన్న మూడు కిలోమీటర్ల హైవేపై ఈ విమానాలు దిగుతాయి. ఇది లక్నో నుంచి కాన్పూర్ మధ్య ఉంటుంది. ఎమర్జెన్సీ టేకాఫ్, ల్యాండింగ్స్‌ను పరీక్షించేందుకు ఐఏఎఫ్ ఈ విన్యాసాలను చేయనున్నది.

## హిమాచల్ తీర్పు

# ఇటు వీరభద్రుడి విక్రమాదిత్య.. అటు నడ్డా వర్సెస్ అనురాగ్ ధుమాల్

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు నాయకుల వారసుల రంగ ప్రవేశానికి మార్గం సుగమం చేస్తున్నాయి. ఇటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సీఎం వీరభద్ర సింగ్ 83 ఏళ్ల వయస్సుకు చేరుకోవడంతో తన కుమారుడు విక్రమాదిత్య సింగ్‌ను తన రాజకీయ వారసుడిగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు 73 వసంతాలు దాటిన ప్రతిపక్ష బీజేపీ సీనియర్ నేత ప్రేమ్ కుమార్ ధుమాల్ పార్టీలో తన విరోధి - కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు వ్యతిరేకంగా ఎంపీ తనయుడు అనురాగ్ ఠాకూర్‌ను తన రాజకీయ వారసుడిగా బరిలోకి దింపాలని యోచిస్తున్నారు.

68 అసెంబ్లీ స్థానాలు గల హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య ముఖాముఖీ పోరు జరుగనున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఇరు పార్టీల నాయకుల వారసుల రాజకీయ అరంగ్రేటానికి దారి సుగమవుతున్నది. సహజంగానే హిమాచల్ ప్రదేశ్ వాసులంతా నేతల తదుపరి వారసుల కోసం చర్చిస్తున్నారని హిమాచల్ ప్రదేశ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆర్ఎస్ చౌహాన్ తరువాయి 2లో



# రాజస్థాన్ ప్రభుత్వంపై హైకోర్టులో పిల్



జయపుర: రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం ఆ రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. సీఎం వసుంధర రాజే ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లును వ్యతిరేకిస్తూ ఓ న్యాయవాది ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ ఆర్డినెన్స్ అధికారులు, ప్రజాప్రతినిధులను నేరాలకు పాల్పడమని లైసెన్సు ఇచ్చినట్లు ఉందని సదరు తరువాయి 2లో

# ఈసీకి మొక్కాలా..?



న్యూఢిల్లీ: హిమాచల్ ప్రదేశ్‌తో పాటు గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించకపోవడంపై చెలరేగిన దుమారం కొనసాగుతూనే ఉంది. ఎన్నికల కమిషన్‌ను (ఈసీ) ప్రశ్నించే అధికారం కాంగ్రెస్‌కు లేదని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ మండిపడింది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎందుకు ప్రకటించలేదని ఈసీని కాంగ్రెస్ ప్రశ్నించడాన్ని ప్రధాని తప్పుపట్టడం పట్ల విస్మయం వ్యక్తం చేసింది.పౌరులు ఈసీని ప్రశ్నించకుంటే మరి ఎవరు ప్రశ్నిస్తారని నిలదీశారు. పౌరులు ఇక ఏం చేయాలి ఈసీకి మొక్కాలా..? అంటూ చిదంబరం ట్వీట్ చేశారు. ఇటీవల తరువాయి 2లో

## బ్రేకింగ్ న్యూస్

# కాంగ్రెస్‌లోకి హార్దిక్ పటేల్?



అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ పరిణామాలు వేగంగా చోటుచేసుకుంటున్నాయి. పటేళ్ల రిజర్వేషన్ పోరాట నేత హార్దిక్ పటేల్ కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గుజరాత్ పర్యటనలో ఉన్న రాహుల్ గాంధీ సోమవారంనాడు అహ్మదాబాద్‌లోని ఓ హోటల్‌లో హార్దిక్ పటేల్‌ను కలుసుకున్నారు. దీంతో హార్దిక్ పటేల్ కాంగ్రెస్‌లో చేరడం ఖాయమైందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అహ్మదాబాద్‌లో కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'ఓబీసీ నవసర్జన్ జనాదేశ్ మహాసమ్మేళన్'లో రాహుల్ పాల్గొనున్నారు.

ఈ నేపథ్యంలో ఈ ఇరువురు నేతలూ సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాహుల్ సభలో హార్దిక్ కూడా పాల్గొంటారని తెలుస్తోంది.

అయితే, హార్దిక్ కాంగ్రెస్‌లో చేరే విషయాన్ని ఇదే వేదక నుంచి ప్రకటిస్తారా లేదా అనేది ప్రస్తుతం ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

# అర్హులందరికీ ఉద్యోగాలు కల్పిస్తాం

బోథ్: తెలంగాణలోని అర్హులైన యువతీ, యువకులందరికీ ఉద్యోగాలు కల్పిస్తామని, తొందరలోనే ఆయా ప్రభుత్వ శాఖల్లో 45వేల ఉద్యోగాలకు ప్రకటన వెలువడనుందని రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. బోథ్ మండలం నిగినిలో ఏర్పాటు చేసిన తెరాస పార్టీ బహిరంగసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తున్నారని తెలిపారు. త్వరలోనే ఎలాంటి షరతులు లేకుండా బీసీలకు బ్యాంకుల ద్వారా రాయితీ రుణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. అటవీశాఖ అధికారులతో సర్వే నిర్వహించి 3 నెలల్లో కైలాష్‌టేకిడి ఆలయానికి రహదారి నిర్మిస్తామన్నారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ఆలయ రహదారి నిర్మాణానికి ఉపాధిహామీ తరువాయి 2లో

# బౌద్ధ ధమ్మంతోనే శాంతి, సమానత్వం

హైదరాబాద్: బౌద్ధ ధమ్మంతోనే ప్రపంచశాంతి, మానవుల మధ్య అసమానతలు తొలగి సమానత్వం సిద్ధిస్తుందని కేంద్ర మంత్రి రాందాస్ అథవాలె అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని డె%ట్ మైదానంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో బౌద్ధ ధమ్మ పరివర్ధన్ దివస్ సందర్భంగా నిర్వహించిన బహిరంగసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత దళిత సంఘాల నాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు హాజరైన వేలాది మంది బౌద్ధ, దళిత కులస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులపై దాడులు కొనసాగుతున్నాయని వాటిని అరికట్టేందుకు కేంద్రం ప్రభుత్వ పరంగా కృషిచేస్తున్నామన్నారు. గౌతమ బుద్ధుని బోధనలు శాంతిని సిద్ధింపజేస్తామని అది గ్రహించి అంబేడ్కర్ నాగ్‌పూర్‌లో బౌద్ధధమ్మాన్ని స్వీకరించారని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా రామ మందిరంలో దళితులకు ప్రవేశం కలిగినప్పుడే వారికి మనుషుల్లో నిజమైన సమానత్వం సిద్ధించినట్లుగా భావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం దళితుడిని రాష్ట్రపతి చేసి దళితుల గౌరవాన్ని చాటిందన్నారు. దళితులంతా అన్నికులాల వారితో సఖ్యంగా ఉండి ప్రధానమంత్రి అయ్యేలా అడుగులు వేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా తరువాయి 2లో






## టేకిట్ ఈజీ



కోర్టు తీర్పుతో అయ్యగార్ షాక్‌లో ఉంటే మీరేంటి? యాత్ర ఎప్పుడు ప్రారంభిస్తారు అని అడగడానికి వచ్చారు



# జగన్‌కు కోర్టులో మళ్లీ ఎదురుదెబ్బ

- జగన్ పిటిషన్‌ను డిస్మిస్ చేసిన కోర్టు
- పాదయాత్రకు నిరాకరణ
- అప్పీలుకు వెళ్లే యోచనలో జగన్

హైదరాబాద్: వైసీపీ అధినేత జగన్‌కు సీబీఐ కోర్టులో మళ్లీ ఎదురు దెబ్బ తగిలింది.

జగన్ పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది. పాదయాత్ర కోసం కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిచ్చేందుకు సీబీఐ కోర్టు నిరాకరించింది. మినహాయింపు ఇస్తే విచారణ ఆలస్యమవుతుందని సీబీఐ, ఈడీ వాదనలు వినిపించాయి. సీబీఐ, ఈడీ వాదనలను న్యాయస్థానం ఏకీభవించింది.

అప్పీలుకు వెళ్లే యోచనలో జగన్ ఉన్నట్లు సమాచారం.

# రవాణా శాఖలో త్వరలో ఆరువేల పోస్టుల భర్తీ



రాయచూరు : రాష్ట్ర రవాణా శాఖలో ఆరువేల ఉద్యోగ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామని ఆ శాఖ మంత్రి హెచ్.ఎం.రేవణ? తెలిపారు. దేవదుర్గకు సమీపంలోని కాగినెల శాఖా మఠంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతూ ఆదివారం ఇక్కడి ఐబీలో ఆయన తనను కలుసుకున్న విలేకర్లతో మాట్లాడారు. జనస్నేహి పరిపాలన అందించే ఉద్దేశంతో నాలుగు నిగమ విభాగాల్లో అంతర బదిలీలకు చర్యలు చేపట్టామని, ఈ క్రమంలో 3900 మందికి బదిలీ భాగ్యం దక్కిందని చెప్పారు. ఈ బదిలీలన్నీ పారదర్శకంగా జరిగాయన్నారు. హై-క ప్రదేశానికి 371(జె) అధికరణలో కల్పించిన సౌలభ్యాల గురించి తాను వ్యతిరేకంగా మాట్లాడలేదని స్పష్టం చేశారు. ఆరు జిల్లాల కోసం ప్రత్యేక ప్రతిపత్తి సాధనకు గతంలో తాను మద్దతు ఇచ్చి, పోరాటం చేశానని గుర్తుచేశారు. తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. సిద్ధరామయ్య ప్రభుత్వం ఏర్పాటయ్యాక గడిచిన నాలు గేళ్లలో 24వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇందులో హై-క భాగానికి చెందిన 3700 మందికి ఉద్యోగాలు లభించాయని వివరించారు. రవాణా శాఖను లాభాల బాట పట్టించేందుకు, సిబ్బంది జనస్నేహిగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హై-క భాగంలో బస్సుల సంచార వ్యవస్థను బలో పేతం చేస్తామని, ప్రయాణికు లకు సరిపడే బస్సులు నడుపు తామని చెప్పారు.

9లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులను మారుస్తామన్నారు. రాయ చూరు జిల్లాకు ఓల్వో బస్సు నడపాలని డిమాండు ఉందని, త్వరలో సమకూరు స్తామని హామీ ఇచ్చారు. టిప్పు జయంతిని భాజపా రాజకీయం చేస్తోందని ఆరోపించారు. ప్రభు త్వం ఆధ్వర్యంలో ఇతర మహ నీయుల జయంతుల మాదిరిగానే టిప్పు జయంతిని ఆచరిస్తున్నట్లు చెప్పారు.

### ముస్లిం పూర్వీకుల

## పవిత్ర సామగ్రి ప్రదర్శన

బరగఢ్ :బరగఢ్ హాట్‌పదా హిమాన్‌బాడ్ వద్ద ముస్లిం పూర్వీకులు వినియోగించిన పవిత్ర సామగ్రి ప్రదర్శన జరిగింది. మహారాష్ట్ర జలాలాబాద్ నుంచి తీసుకొచ్చిన ఈ సామగ్రి ప్రదర్శనలో ఉంచారు. జిల్లాకి చెందిన ముస్లింలు హాజరై తిలకించారు. ఎమ్మెల్యే దేబేష్ ఆచార్య, భాజపా నేత సుభాష్ చౌహాన్, దేబబ్రత మిశ్ర, పురపాలక అధ్యక్షుడు ప్రశాంత్ బెహరా తదితరులు హాజరయ్యారు. మహమ్మద్ గురు షేక్ అబ్దుల్లా, నజుద్దీన్ తదితరులు పాల్గొని వాటి పవిత్రతను వివరించారు.

## కోటికి చేరువలో ఉల్లంఘన కేసులు

బెంగళూరు : మద్యం తాగి వాహనాలు నడపడం, శిరస్త్రాణం లేకుండా సంచరించడం తదితర నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన కేసులు నగరంలో ఈ ఏడాది కోటి దాటవచ్చని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. జనవరి నుంచి సెప్టెంబరు వరకు సంచార నిబంధనలు ఉల్లంఘించినందుకు 80,93,719 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ నెలాఖరుకు ఈ సంఖ్య కోటి దాటవచ్చని భావిస్తున్నారు. 2016లో సంచార పోలీసులు 1,80,438 కేసులు నమోదు చేశారు. దీన్ని ఈసారి అధిగమిస్తారు. నిషిద్ధ ప్రాంతంలో వాహనాలు నిలిపిన (నో పార్కింగ్ జోన్) కేసులు ఇందులో ఎక్కువగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలో 68 లక్షల వాహనాలు సంచరిస్తుండగా రోజూ అయిదు వేల నుంచి ఏడువేల కేసుల్ని నమోదు చేస్తున్నారు. జరిమానా రూపంలో రూ.18 కోట్లకు పైగా వసూలవుతున్నాయి. నగరంలో ఏ దారిలో ఎప్పుడు నో పార్కింగ్ బోర్డు వస్తుందో తెలియని స్థితి నెలకొంది. నిషిద్ధ సూచిక లేదని వాహనాన్ని నిలిపితే సంచార పోలీసులు ఆ వాహనాన్ని గుట్టుచప్పుడు కాకుండా తమ స్వాధీనంలోకి తీసుకోవడం మామూలు విషయంగా మారింది. దీన్ని విడిపించుకునేందుకు రూ.వెయ్యి వదులుకోవాలి. సంచార పోలీసులకు ఇలాంటి అపరాధ రుసుము పెరుగుతుందే కాని సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

### పోలీసులకు

## 11వేల వసతి గృహాలు!

### హెూంమంత్రి రామలింగారెడ్డి వెల్లడి



రాయచూరు : 'రాష్ట్రంలో పోలీసులకు 11 వేల వసతి గృహాలు నిర్మాణం జరుగుతోంది. ఇందులో 2782 గృహాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని' హెూం శాఖ మంత్రి రామలింగారెడ్డి తెలిపారు. యాదగిరిలో నూతనంగా నిర్మించిన ఎస్పీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. 104 వసతి గృహాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటైన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పోలీసు బీట్ వ్యవస్థను మెరుగుపరిచినట్లు తెలిపారు. దీని వల్ల పోలీసులు, ప్రజల మధ్య సంబంధాలు మెరుగవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఢోకా లేదన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన 165 హామీల్లో 155 హామీలను ఇప్పటికే సిద్ధరామయ్య ప్రభుత్వం నెరవేర్చిందని గుర్తుచేశారు. హై-క అభివృద్ధికి ఎంపీ మల్లికార్జున ఖర్గే ఎంతో శ్రమించారని కొనియాడారు.

## రోడ్డెక్కిన మొక్కజొన్న రైతు

పర్లాఖెముండి : కొద్దిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మొక్కజొన్న పంట తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలంటూ మోహన సమితిలోని రైతులు ఆందోళనకు దిగారు. గోవిందపూర్ పంచాయతీకి చెందిన మొక్కజొన్న రైతులు సమితి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయిదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లింది. మొక్కలు నేల కొరిగాయి. పొలంలోని నీటిలో మొక్కజొన్న పొత్తు నాని దెబ్బతిన్నాయి. ప్రధానంగా గోవిందపూర్ పంచాయతీలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్నకు పూర్తిగా నష్టం వాటిల్లిందని వాపోయారు. అప్పుచేసి సాగుచేసామన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే సర్వే జరిపి పరిహారం అందేలా చేయాలన్నారు. తక్షణ సహాయం అందిస్తే పూర్తిగా పంటనష్టం జరిగినచోట ప్రత్యామ్నాయ పంటలు సాగుచేస్తామని వాపోయారు. ఈ మేరకు వారంతా బీడీఓకు వినతిపత్రాన్ని అందజేశారు. సహకార సంఘం రుణాలు తీసుకుని పెట్టుబడి పెట్టామని ల్యాంప్ డైరెక్టర్ సస్మితా పండా తెలిపారు.

## ప్రదర్శనలతో వెలుగులోకి విద్యార్థుల సృజనాత్మకత



బ్రహ్మపుర : తరచూ వైజ్ఞానిక ప్రదర్శనలు, సదస్సులతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని స్థానిక కళ్లికోట స్వయం ప్రతిపత్తి కళాశాల అధ్యాపకుడు బి.పి.బారిక్ అన్నారు. స్థానిక శివానంద నగర్‌లోని మా సరస్వతీ శిశు విద్యా మందిర్ ఆధ్వర్యంలో బొమ్మల ప్రదర్శన, పాఠశాల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బారిక్ మాట్లాడుతూ విద్యార్థులు వివిధ అంశాలు చూసి, విని తెలుసుకోవడంతో పాటు ఆయా అంశాలూ సొంతంగా తీర్చిదిద్దేందుకు దృష్టి పెట్టాలని కోరారు. భారత్ అభివృద్ధి చెందుతోందని, విద్యార్థులు తమలోని వైజ్ఞానిక ఆలోచనలను అమల్లోకి పెడితే భవిష్యత్తులో దేశం, ప్రపంచం గర్వించే శాస్త్రవేత్తలవుతారని చెప్పారు. నిర్వాహక విద్యామందిర్ కమిటీ అధ్యక్షుడు రబినారాయణ మిశ్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి గౌరీ పాత్ర్, జిల్లా విజ్ఞాన పర్యవేక్షకుడు పన్నగ భూషణ మిశ్ర, ఇకో క్లబ్ జిల్లా సమన్వయకర్త శంకర నారాయణ బెజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యామందిర్‌లోని ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 224 వైజ్ఞానిక అంశాలను రూపొందించి ప్రదర్శించారు.

ఈ సందర్భంగా జరిగిన బొమ్మల ప్రదర్శనలో పలువురు చిన్నారులు వేష ధారణలతో అలరించారు.

## ధ్యానంతో మానసిక ప్రశాంతత



కంప్లి : నేటి ఒత్తిడి జీవనానికి ధ్యానం చక్కని ఔషధం వంటిది. ఏకాగ్రతతో ధ్యానం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుంది. తీరిక వేళల్లో సమయాన్ని వృథా చేయకుండా ధ్యానంపై మనసు లగ్నం చేయాలని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్స్ వ్యవస్థాపకుడు సుభాష్ పత్రీజీ సూచించారు. కంప్లిలోని నీరావరి కార్యాలయం ఎదురుగా ఏర్పాటైన రామకృష్ణ పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రశాంతంగా కూర్చొని శ్వాసపై దృష్టి సారించాలి. ఆ సమయంలో ఆలోచ నలను నియంత్రించు కోవాలి. తద్వారా ఆత్మశుద్ధి కలుగుతుంది. అనిర్వచనీయమైన ఆ అనుభూతి మాటల్లో చెప్పలేనిది. అనంతరం కర్ణాటక ధ్యాన ప్రచార ట్రస్టు అధ్యక్షుడు వరాహమూర్తి ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి సత్సంగ ప్రసంగం నిర్వహించారు.

ఔ స్థానిక పిరమిడ్ కేంద్ర ప్రతినిధి కోనేరు శ్రీరామకృష్ణ మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన మందిరంలో ఎవరైనా ధ్యానం చేసుకోవచ్చన్నారు. వినోదశ్రీ, లలితా నారాయణ్, సుమంగళ, రుద్రయ్యచౌదరి, గోవిందరాజు, ఎన్.శివప్ప తదితరులు పాల్గొన్నారు.

# 2 నుంచి భాజపా పరివర్తన యాత్ర

### - ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం - మురళీధర్‌రావు వెల్లడి

బెంగళూరు : నవ కర్ణాటక నిర్మాణం కోసం నవంబరు 2న పరివర్తన యాత్ర నిర్వహించనున్నట్లు భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ బాధ్యుడు కె.మురళీధర్‌రావు తెలిపారు. యాత్ర సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ అవినీతి కుంభకోణాల్ని బహిర్గతం చేస్తామని వెల్లడించారు. పరివర్తన యాత్ర ప్రారంభోత్సవ కార్యక్రమం తుమకూరు మార్గంలోని అంతర్జాతీయ వస్తు ప్రదర్శన శాల మైదానంలో జరగనుంది. ఆదివారం ఇక్కడ ఆ వేదికకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ అవినీతి అక్రమాల్ని వెలుగులోకి తేవడం ద్వారా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఏఐసీసీ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీలకు సవాల్ విసురుతామన్నారు. అవినీతి ఆరోపణలపై దృశ్య మాధ్యమాల స్టూడియోల్లో కూర్చుని చర్చించకుండా ప్రజల వద్దకు వెళ్లడం ద్వారా రాష్ట్రంలో కొత్త రాజకీయ అంకానికి తెరలేపుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపి భాజపా ప్రభుత్వ ఏర్పాటు లక్ష్యంతో యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి మయమైందని, అన్ని రంగాల్లో విఫలమయ్యారని మురళీధర్‌రావు ఆరోపించారు. కమీషన్లు సేకరించడంలో సిద్ధరామయ్య తీరిక లేకుండా ఉన్నారని వ్యాఖ్యానించారు. నవ కర?టక నిర్మాణానికి భాజపా పూర్తిగా కట్టుబడి ఉందని వెల్లడించారు. అన్నివర్గాలవారు ప్రశాంతంగా జీవించే వాతావరణం కల్పిస్తామన్నారు. అర్హులకు పథకాలు దక్కే విధంగా పరిపాలన సాగిస్తామన్నారు. రైతుల్లో ఆత్మవిశ్వాసం నింపి, వారి సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విభజించు-పాలించు సిద్ధాంతాన్ని పాటిస్తున్నారని, భాజపా అన్నివర్గాల్ని కలుపుకొని ముందుకు సాగుతుందని మురళీధర్‌రావు తెలిపారు. ముఖ్యమంత్రి అభ్యర్థి యడ్యూరప్ప నేతృత్వంలో సాగే యాత్రలో భాజపా నేతలంతా పాల్గొంటారని వెల్లడించారు. బెంగళూరు, హుబ్బళ్లిల నుంచి ఒకేసారి యాత్ర ప్రారంభిస్తామన్నారు. ప్రతి బూత్ సమితి నుంచి మూడు ద్విచక్ర వాహనాల్లో ఆరుగురు కార్యకర్తలు పాల్గొంటారని, ఇలా 27 వేల బూత్ సమితుల నుంచి సమీకరిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి సదానందగౌడ, లోక్‌సభ సభ్యులు శోభా కరంద్లాజె, పీసీ మోహన్, మాజీ ఉపముఖ్యమంత్రి అశోక్, శాసనసభ్యులు విశ్వనాథ్, మునిరాజు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రాజస్థాన్ ప్రభుత్వంపై హైకోర్టులో పిల్

పిటిషన్‌దారుడు ఆరోపించారు. ఈ వివాదాస్పద బిల్లును వెంటనే రద్దు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆందోళన చేపట్టింది. అవినీతిపరులను రక్షించేందుకే దీనిని తీసుకొచ్చారంటూ కాంగ్రెస్ నేత సచిన్ పైలెట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

అయితే.. ఈ ఆర్డినెన్స్‌కు కేంద్ర మంత్రి పి.పి.చౌదరి మద్దతు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి చట్టం అవసరం చాలా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఆర్డినెన్స్ ఏమిటంటే..**

న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులపై అవినీతి ఆరోపణలకు సంబంధించిన విచారణ జరిపేందుకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలంటూ రాజస్థాన్ ప్రభుత్వం ఓ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. సెప్టెంబరు 7న ఈ ఆర్డినెన్స్‌ను జారీ చేశారు. దీని ప్రకారం అధికారులు, ప్రజాప్రతినిధులకు వ్యతిరేకంగా న్యాయస్థానంలో కేసులు వేయడాన్ని నేరంగా పరిగణిస్తారు. దానికి సంబంధించిన వార్తలను మీడియాలో ప్రసారం చేసిన పాత్రికేయులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. నిబంధనలను అతిక్రమించిన మీడియా యాజమాన్యాలు, పాత్రికేయులకు రెండు సంవత్సరాల పాటు జైలు శిక్షను విధించే అవకాశం కూడా ఉంది.

## హిమాచల్ తీర్పు

తెలిపారు. కానీ సహజంగానే సీఎం వీరభద్ర సింగ్‌కు, సీఎం అభ్యర్థిని ప్రకటించని బీజేపీకి మధ్య ముఖాముఖీ పోటీ జరుగనున్నదని చెప్పారు. వీరభద్ర సింగ్ తన తనయుడిగా విక్రమాదిత్య సింగ్ (28)ను ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సిమ్లా రూరల్ స్థానం నుంచి అభ్యర్థిగా, తన రాజకీయ వారసుడిగా ప్రకటించనున్నారు. గత ఐదేళ్లుగా హిమాచల్ ప్రదేశ్ యువజన కాంగ్రెస్‌లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చిన విక్రమాదిత్య సింగ్.. ప్రభుత్వ కీలక విధాన నిర్ణయాల్లోనూ భాగస్వామి అయ్యారు.

## ఈసీకి మొక్కాలా..?

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి పాలైన తర్వాత తిరిగి రీకౌంట్ జరిగిన అనంతరం ఆ పార్టీ అభ్యర్థి గెలిచారని..ఇందులో మతలబు ఉందని ప్రధాని చేసిన వ్యాఖ్యలనూ చిదంబరం తిప్పికొట్టారు.

తాము రాజ్యసభ ఎన్నికల కౌంటింగ్‌కు ముందే ఈసీకి ఫిర్యాదు చేశామని చెప్పారు.గుజరాత్ ఎన్నికల తేదీల ప్రకటనలో జాప్యం పట్ల ఈసీని గతంలో కూడా చిదంబరం విమర్శించారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించే అధికారం ప్రధానికి ఈసీ కట్టబెట్టిందని సెటైర్లు వేశారు.మరోవైపు గుజరాత్ ఎన్నికలను జాప్యం చేసేందుకు ఈసీ, బీజేపీ కుమ్మక్కయ్యాయని కాంగ్రెస్ ఆక్షేపించింది.

## బౌద్ధ ధమ్మంతోనే శాంతి, సమానత్వం

ఆన్‌లైన్ వ్యవహారాలు నిర్వహించేందుకు కేంద్రప్రభుత్వం భీమ్‌యాప్ ప్రారంభించిందన్నారు. రాష్ట్ర మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సైతం అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు ప్రాధాన్యమిచ్చి మంత్రివర్గంలో చోటు కల్పించారన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విన్నవించి ఏజన్సీ ప్రాంతాల్లో గిరిజన, దళితులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. భారతీయ బౌద్ధమహాసభ రాష్ట్ర కన్వీనర్ రత్నజాడే ప్రజ్ఞకుమార్ మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో రూ.2 కోట్లతో బౌద్ధవిహార్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అంబేడ్కర్ భవన నిర్మాణంలో రాష్ట్ర మంత్రి సహకారం మరువలేనిదని కొనియాడారు. భీమ్‌గర్జన సీడీని సభాముఖంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీ గొడం నగేష్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌గౌడ్, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు కస్తాల ప్రేమల, జేసీ కృష్ణారెడ్డి, దళిత, గిరిజన సంఘాల నాయకులు గంగారాంబోరేకర్, బాబుగజ్‌బారే, నాందేవ్‌కాంబ్లే, కుర్సెంగతానాజీ, గెడం మనోహర్, నందులాండ్గే, జె.కమలాబాయి, మధుభావాల్కర్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఉద్యోగాలు కల్పిస్తాం

పథకంలో రూ.50 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. బోథ్ నుంచి నిగిని వరకు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రెండు లేన్ల రహదారి నిర్మాణానికి జడ్పీ సమావేశంలో తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ మాట్లాడుతూ నిగిని గ్రామానికి ఇప్పటికే రూ.4 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేశామని, ఆలయ రహదారి నిర్మాణానికి రూ.15 లక్షలు, గ్రామ హనుమాన్ ఆలయానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు గ్రామస్థులు తెరాసలో చేరారు. కార్యక్రమంలో కైలాష్‌టేకిడి లింబాజీ మహారాజ్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, గ్రంథాలయ ఛైర్మన్ మనోహర్, తెరాస జిల్లా ఉపాధ్యక్షుడు జివి.రమణ, మార్కెట్ ఛైర్మన్లు నల్ల శారద, ఆడె శీల, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ తుల శ్రీనివాస్, జడ్పీటీసీ సభ్యురాలు సాయమ్మ, ఎంపీపీ గంగుల లక్ష్మి, సర్పంచి పూర్ణాబాయి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నారాయణ, గ్రామస్థులు బద్రూ, రామారావ్, కాశీనాథ్, తెరాస మండల అధ్యక్షుడు రుక్మన్‌సింగ్, మాజీ ఎంపీపీలు అప్క కిషన్, ముత్యంరెడ్డి, నాయకులు మల్లేష్, నారాయణరెడ్డి, జగన్‌రెడ్డి, డా.సురేందర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయ శిల్పకృతులకు ప్రాధాన్యమివ్వండి

హెూసపేటె : రాష్ట్రంలోని శిల్పకళాకారుల బతుకులు దయనీయంగా ఉన్నాయి. వారి కుటుంబాలు తీవ్ర సంకష్ట స్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వాలు ఆ కుటుంబాలను ఆదుకోవాల్సి ఉందని కర్ణాటక శిల్పకళా అకాడమీ అధ్యక్షుడు రు.కాళాచార్ ఆవేదన వెలిబుచ్చారు. కర్ణాటక శిల్పకళా అకాడమీ, కన్నడ సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ సంయుక్తంగా హంపీ ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శిల్పకళా శిబిరంలో ఆయన మాట్లాడారు. మరో హంపీని సృష్టించే నైపుణ్యం గల శిల్పకళాకారులు మన రాష్ట్రంలో ఉన్నారు. కాని వారికి ఆదరణ లేకపోడంతో ఆకుచాటు పిందెల్లా మిగిలిపోతున్నారు. ప్రభుత్వాలు కూడా వారిని ఆదుకోవటం లేదు. విజయనగర సామ్రాజ్యం హయాంలో శిల్పకళాకారులకు రాజాశ్రయం ఉండేది. పెద్ద ఎత్తున కళాకారులను రాజులు పోషించేవారు. శిల్పకళాకారులు కూడా చిత్తశుద్ధితో పనిచేసేవారు. అధునాతన శిల్పాకృతులకన్నా, మన సంప్రదాయ శిల్ప కృతులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధ్యక్షురాలు భారతిరెడ్డి, జిల్లా అధికారి డాక్టర్ రామ్ ప్రశాత్ మనోహర్, ఎమ్మెల్యే ఆనంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హెూసపేటెలో నిర్వహించిన గోడలపై చిత్రలేఖన పోటీలకు మంచి స్పందన రావడంతో కమలాపురలోనూ నిర్వహించగా 30మంది కళాకారులు పాల్గొ న్నారు. పొరుగున హంపీ ఉన్నందున ఎక్కువ మంది కళాకారులు హంపీ గతవైభవాన్ని చాటే చిత్రలేఖనాల్నే గోడలపై గీసి అబ్బురపరిచారు.

## 'సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయనీయం'



కటక్ : అట్టొగఢ్ ప్రాంతంలో ఎట్టి పరిస్థితిల్లోనూ సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయబోనీయమని భాజపా రాష్ట్ర కార్యదర్శి నయనకిశోర్ మహంతి అన్నారు. గురుడిజటియా ప్రాంతంలో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పంటభూములు, గోచర భూములను ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్ని స్తోందని ఆరోపించారు. అట్టొగఢ్ బిజద శాసనసభ్యుడు రణేంద్రప్రతాప్ స్వయి ప్రైవేటు సంస్థలతో చేతులు కలిపి గ్రామస్థులకు ఉపయోగపడే భూములను సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు ఇచ్చేందుకు ప్రయత్నం చేశారని విమర్శించారు. ఈ మేరకు గతవారం గ్రామసభ నిర్వహించారు. సభలో పరిసర ప్రాంతాల్లో ఉన్న గ్రామస్థులు దీన్ని వ్యతిరేకించారు.

సభ జరిగిన ప్రాంతంలో వ్యతిరేకించడంతో వారిపై పోలీసులచే లాఠీఛార్జి జరిపించారు. అలాగే 15మంది భాజపా మద్దతు దారులపై తప్పుడు కేసులు నమోదు చేసి, అరెస్టుచేసి కారాగారానికి తరలించారని ఆరోపిం చారు. వారు బెయిల్‌పై కారాగారం నుంచి విడిపించామని అన్నారు. వారికి స్వాగతం పలుకుతూ ర్యాలీ నిర్వహించామని తెలిపారు.

పచ్చదనంతో కూడిన అట్టొగఢ్ ప్రాంతంలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ఆ చుట్టు పక్కల గ్రామాల్లో కాలుష్యం ఏర్పడి ప్రజలు సమస్యలు ఎదుర్కొం టారని, ప్రభుత్వం పరిశ్రమను ఇతర ప్రాంతా లకు తరలించాలని తెలిపారు.

# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## ఘనంగా కొమురం భీం జయంతి

మహబూబ్‌నగర్ : గిరిజన హక్కుల కోసం పోరాడిన కొమురం భీం జయంతిని మహబూబ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా గిరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో మెట్టుగడ్డలోని సంఘ భవనంలో కార్యక్రమం చేపట్టారు. కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజన సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ, శీతాకాల శాసనసభ సమావేశాల్లో గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లను ఆమోదించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు నష్టం చేకూరేలా ఇతరులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని అన్నారు. అనంతరం పద్మావతి కాలనీలోని కొమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెట్టుగడ్డలోని అంధుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎరుకల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొన్నకల్ కృష్ణయ్య, గిరిజన సేవా సంఘం, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు రవి రాథోడ్, నరేశ్, తిరుపతి, చందు, కిరణ్, సంపత్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఒప్పంద అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్



మహబూబ్‌నగర్ : ఒప్పంద అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. తమను క్రమబద్ధీకరించే వరకు పన్నెండు నెలల వేతనం చెల్లించాలని కోరారు. ఆరోగ్య కార్డులతో పాటు బీమా సదుపాయం కల్పించాలన్నారు. ఒకేషనల్ కళాశాలల్లో రెండవ పోస్టును వెంటనే అనుమతి ఇవ్వాలని, రెగ్యులర్ అధ్యాపకులతో సమానంగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిగ్రీ కళాశాలల్లో పని చేసే అధ్యాపకులకు పరీక్షలకు సంబంధించిన విధులు కేటాయించాలన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు డా.హన్మంతు మాట్లాడుతూ.. ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం సంఘటితంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు శోభన్, ప్రవీన్‌కుమార్, కురుమూర్తి, శ్రీనివాసరెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పంపిణీలో నగదు బదిలీ సరికాదు

### రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు

మహబూబ్‌నగర్ : ప్రజా పంపిణీలో నిత్యావసర సరకులకు బదులు నగదు బదిలీ చేపట్టడం సరికాదని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు ఖండించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల రేషన్ డీలర్ల సమావేశంలో ఆయనతోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ రెడ్డి, ప్రచార కార్యదర్శి కొండల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నారు. డీలర్లకు యూనివర్సల్ పద్ధతిన నెలకు రూ.30 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. నగదు బదిలీ ఆలోచనను విరమించుకోవాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ విధానం ద్వారా నిరుపేదలకు ప్రజా పంపిణీ సరకులు అందకుండా పోతాయని అన్నారు. ప్రజా పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు ఈ-పాస్ విధానం తీసుకొచ్చిన ప్రభుత్వం.. చౌక దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన తరహాలోనే స్టాక్‌పాయింట్‌ల వద్ద కూడా ఈ-పాస్ విధానం అమలు చేయాలన్నారు. డీలర్లకు అందించే సరకులు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌పై తూకం చేసి సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తూకం తక్కువగా ఇస్తూ.. సక్రమంగా పంపిణీ చేయాలంటూ వంద గ్రాములు, పావుకిలో తూకం తక్కువ ఉన్నా, చౌకధరల దుకాణాల్లో సరకుల నిల్వల్లో కిలో తేడా ఉన్నా కేసులు నమోదు చేయడమంటే డీలర్లను వేధించడమే అన్నారు.

చౌకధరల దుకాణ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఈ నెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ అన్వర్‌పాషా తెలిపారు. ఎల్‌బీనగర్‌లో నిర్వహించే బహిరంగ సభకు అఖిల భారత రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుష్పరాజ్ కాకా హాజరుకానున్నారన్నారు.

## బీసీ ఉప ప్రణాళిక బిల్లును ప్రవేశపెట్టాలి

కల్వకుర్తి : కేంద ప్రభుత్వం పార్లమెంటు సమావేశాల్లో, రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ సమావేశాల్లో బీసీ ఉపప్రణాళిక బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ ఉప ప్రణాళిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీమనోహర్ డిమాండ్ చేశారు. కల్వకుర్తిలో ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించతలపెట్టిన బీసీ ఉప ప్రణాళిక సాధన సమితి ద్వితీయ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మురళీమనోహర్ మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు బీసీలను ఓటుబ్యాంకుగానే పరిగణిస్తున్నాయేగానీ సంక్షేమ పథకాలను అమలుచేయడంలేదన్నారు. బీసీ కులాల ఆర్థిక, సామాజిక, విద్యా తదితర వివరాల కుటుంబ సర్వే వివరాలను సేకరించి బయటపెట్టాలన్నారు. కల్వకుర్తిలో ఈ నెల 28, 29వ తేదీల్లో నిర్వహించనున్న బీసీ ఉప ప్రణాళిక సాధన సమితి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ ఉప ప్రణాళిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లె గోపాల్, నియోజకవర్గ అధ్యక్షుడు రాజేందర్, వివిధ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు ఉపాధి కల్పించాలి

కందనూలు : ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటాలు చేసిన తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిడికిళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఉపాధి అవకాశాలను కల్పించాలంటూ నాగర్‌కరూఓనల్ పట్టణంలో గాంధీ వనంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ప్రచారం నిర్వహించి ఇప్పుడు విస్మరించిందని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంతటి వెంకన్న, తిరుపతయ్య, రవీందర్‌గౌడ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యను అందించడమే స్వేరోస్ ధ్యేయం

### గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

కోదాడ : సమాజ సేవలో ముందుండి నాణ్యమైన విద్యను ప్రతి ఒక్కరికీ అందించడమే స్వేరోస్ లక్ష్యమని గురుకుల విద్యాలయాల సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. కోదాడలో ఏర్పాటు చేసిన స్వేరోస్ రాష్ట్ర తృతీయ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేవుళ్ల పేరుతో భక్తులు చర్చిలకు, దేవాలయాలకు కోట్లాది రూపాయలు ఇస్తున్నారు కానీ పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తే ఎందరో విద్యార్థులు మేధావులుగా తయారయ్యేవారన్నారు. మాజీ ఎంపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.వివేక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యాభివృద్ధికి రూ.1200కోట్లు మంజూరు చేశారన్నారు. రాష్ట్రంలో 571 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి అట్టడుగు వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. గురుకులాల అభివృద్ధికి స్వేరోస్ అధినేత ప్రవీణ్‌కుమార్ చేస్తున్న కృషిని అభినందించారు.

కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న, మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, విద్యాభూషణ్ రావత్, రమేష్, బల్గూరు దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులపై దాడులు అమానుషం

మహబూబ్‌నగర్ : ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడే జర్నలిస్టులపై దాడులకు పాల్పడటం సిగ్గుచేటని జమాతె ఇస్లామి హింద్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆచార్య అబ్దుల్ మజీద్ అన్నారు. ఆదివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమాజ హితం కోసం రాత్రనక, పగలనక పనిచేస్తున్న జర్నలిస్టులపై అరాచక శక్తులు దాడులకు పూనుకోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు సుజాత్ అలి, నాయకులు ముంతాజ్ అలి, జబ్బార్, బదియుల్లా, వాజిద్ అలి, అత్‌హర్, జునైద్ తదితరులు పాల్గొన్నారు.

## వరికోత యంత్రం ఢీకొని బాలుడి మృతి

మహమ్మదాబాద్ : వరికోత యంత్రం ఢీకొని ఓ బాలుడు దుర్మరణం చెందిన దుర్ఘటన మహమ్మదాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండీడ్ మండలం అంచన్‌పల్లి గ్రామానికి చెందిన శ్యామల, చెన్నయ్య దంపతుల కుమారుడు కొప్పుల సాయిచరణ (6) తల్లితో కలిసి మహమ్మదాబాద్‌కు వచ్చారు. సాయంత్రం రోడ్డు దాటుతున్న సమయంలో మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న వరికోత యంత్రం ఢీకొట్టనడంతో సాయిచరణ్ దానికిందే పడిపోయాడు. తల మీదుగా టైర్ వెళ్లడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ ప్రమాద స్థలిని పరిశీలించారు. తల్లి శ్యామల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఆచరణ సాధ్యం కాని ప్రాజెక్టులతో కాలయాపన

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి



డిండి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. సామాజిక తెలంగాణ- రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పోరుబాట యాత్ర నల్గొండ జిల్లా డిండికి చేరుకుంది. ఆ సందర్భంగా డిండి సంత బజారులో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చాడ వెంకట్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షేమాన్ని విస్మరించి, దొరల పాలన కొనసాగిస్తున్నదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్లు, నిధుల్లో అవినీతి జరిగిందని అప్పట్లోనే సీపీఐ పోరాటాలు చేసిన ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య హామీ ఏమైందని ప్రశ్నించారు. రెండు పడక గదుల ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి పంచలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆచరణకు సాధ్యం కాని ప్రాజెక్టుల పేరుతో సీఎం కేసీఆర్ రూ. కోట్ల ఖర్చు చేస్తూ ఆకృతిల పేరుతో కాలయాలన చేస్తున్నా రని, ఎన్ని రోజులకు పంటలకు నీళ్లిస్తారని ప్రశ్నించారు. రైతులు పండించిన పత్తి, మిర్చి పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆదిరెడ్డి, పశ్య పద్మ, బాలమల్లేష్, సాయిలు, పాండురంగాచారి, నర్సింహ, రాములు యాదవ్, మండల కార్యదర్శి తూం బుచ్చి రెడ్డి, వెంకటరమణ, మైనొద్దీన్, రవికుమార్, సుజాత, కేశవులు, శైలేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు: ఆర్డీవో

### నల్గొండలో ముగిసిన కుస్తీ రాష్ట్ర స్థాయి పోటీలు



నల్గొండ : క్రీడలతో విశ్వవ్యాప్త గుర్తింపు లభిస్తుందని నల్గొండ ఆర్డీవో వెంకటాచారి అన్నారు. నల్గొండలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా రెస్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. క్రీడల ద్వారా స్నేహబంధాలు ఏర్పడతాయని తెలిపారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి మక్బుల్ అహ్మద్ మాట్లాడుతూ యువత కొన్ని క్రీడలకే పరిమితం కాకుండా అన్ని క్రీడాంశాల్లో సత్తా చాటాలని కోరారు. నల్గొండలో కుస్తీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రథమ బహుమతిని రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి స్టేడియం క్రీడాకారులు, ద్వితీయ బహుమతిని హైదరాబాద్ జిల్లా కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి స్టేడియం క్రీడాకారులు గెలుపొందారు. అసోసియేషన్ సౌత్ ఇండియా, తెలంగాణ అధ్యక్షుడు హమ్‌జాబిన్ ఉమర్ జాఫర్‌బాబు, తెలంగాణ రెస్లింగ్ అసోసియేషన్ ఛైర్మన్ ఎం.ఏ.హఫీజ్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి నర్సింగ్, జిల్లా అధ్యక్షుడు చిన వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కూతురు లక్ష్మారెడ్డి, జాయింట్ సెక్రటరీ రహీంఖాన్ పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలో సంక్షోభంలోకి సాగు

## తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

### పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



బాలానగర్ : వ్యవసాయ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) అధ్యక్షుడు ఉత్తమకుమార్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంఛార్జి ఆర్.సి కుంతియా అన్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే డీకే అరుణ, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, కోదండరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ తదితరులతో కలిసి బాలానగర్ మండలంలోని ఉడిత్యాల, గుండేడు, నందారం గ్రామాల శివారుల్లో ఇటీవల భారీ వర్షాలకు పాడైపోయిన పత్తి, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. నందారంలో ఉత్తమ కుమార్‌రెడ్డి, కుంతియా విలేకరులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలకు పంటలు నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కూడా కల్పించటం లేదన్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోయిన రైతుల పొలాలను పరిశీలించే తీరిక రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఆయన మంత్రులకు లేకపోయిందని విమర్శించారు. జిల్లాల్లో అధికారుల తీరు కూడా అలాగే ఉందని, పంటలు నష్టపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నావారు గ్రామాలకు వెళ్లిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. రుణమాఫీ పేరుతో ముఖ్యమంత్రి రైతులను మోసం చేశారని ఆరోపించారు. పంటల సాగుకోసం అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకున్న రైతులు చెల్లించే దారిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 3,500 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు ఒక్క రైతు కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని పేర్కొన్నారు. వర్షాలకు చాలావరకు పత్తిపంట పాడైపోయిందని, మిగిలిన కొద్ది పంటలను కూడా కొనేందుకు ప్రభుత్వం ముందుకు రాకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారుల చేతిలో మోసపోవాల్సి వస్తోందన్నారు. పత్తి రైతులకు కూలి కూడా గిట్టుబాటు కావడం లేదన్నారు. పోయిన ఖరీఫ్‌లో రూ. 1,500 కోట్ల మేర పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. పత్తికి ఎకరాకు రూ. 20వేలు, మొక్కజొన్న ఎకరాకు రూ. 10వేలు, వరికి ఎకరాకు రూ. 15 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల వరకు రైతుల రుణాలను ఏక కాలంలో మాఫీ చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నందారం సర్పంచి హరిత, మండల నాయకులు నందీశ్వర్, చంద్రశేఖర్, శంకర్‌నాయక్, తిరుపతి, బిచ్చూనాయక్, వెంకట్‌నాయక్ హరిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మక్కలకు అనావృష్టి.. పత్తికి అతివృష్టి

### వర్షాలు తెచ్చిన నష్టం రూ.200 కోట్లు



నాగర్‌కర్నూల్ : ఆరుగాలం శ్రమించినా రైతులకు నష్టాలు తప్ప లాభాలు రావడం లేదు. విత్తనం విత్తుకున్నప్పటి నుంచీ పంట చేతికొచ్చేవరకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఎదురు చూడాల్సిన దుస్థితి. విత్తన సమయంలో నకిలీ విత్తనాల బెడద.. విత్తనాలు బాగుంటే మొలకెత్తేందుకు కావాల్సిన వర్షాల కోసం దిగులు.. చీడపీడల బెడద.. అంతా సక్రమంగా సాగి పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాల భయం. ఇలా.. ఏడాది పొడుగునా అన్నదాతకు కంటిపై కునుకు ఉండటం లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇటీవల అతిగా కురిసిన వర్షాలకు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నెలన్నర కిందటిదాకా సకాలంలో వర్షాలు కురువక రైతులు నష్టపోగా.. ఇపుడు అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు చేతికొచ్చిన పత్తి, మొక్కజొన్న పంటలు నీటి మునిగి అన్నదాతలను నష్టాల కష్టాలు తెచ్చిపెట్టాయి. నిన్నమొన్నటిదాకా వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటనష్టం జరిగిన ప్రాంతాల్లో సాగు విస్తీర్ణంలో 45 నుంచి 50 శాతం నష్టపోయి ఉంటారని అధికారికంగా తేల్చారు. ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వచ్చే మొక్కజొన్న అనావృష్టి కారణంగా అయిదారు క్వింటాళ్ల దిగుబడికే పరిమితమైంది. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చే పత్తిపంట అతివృష్టి కారణంగా 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. ఈ లెక్కన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపు రూ.200 కోట్లకు పైగా విలువచేసే మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం కలిగినట్లు తెలుస్తోంది. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో దాదాపు రూ.130 కోట్లకు పైగానే పంటనష్టం జరిగినట్లు అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ సీజనులో ఆశించినమేర వర్షాలు కురవలేదు. దీంతో ఉమ్మడి పాలమూరు జిల్లాలో 45 శాతానికి పైగా మొక్కజొన్న పంట ఎండిపోయింది. ఉమ్మడి జిల్లాలో మొక్కజొన్న సాధారణ సాగువిస్తీర్ణం 1,44,210 హెక్టార్లు కాగా..1,30,460 హెక్టార్లలో ఈ మారు సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో అడపాదడపా వానలు కురవడంతో మొక్కజొన్న ఎక్కువగా వేశారు. చివరకు వర్షాలు చేతులు ఎత్తేయడంతో మొక్కజొన్న ఎదగడం ఆగిపోయింది.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఖరీఫ్ కింద పత్తి సాధారణ సాగువిస్తీర్ణం 2,01,381 హెక్టార్లు. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో పత్తి సాగైంది. దిగుబడి చేతికొచ్చే దశలోనే అతివృష్టి దెబ్బతీసింది. పొలంలోనే పత్తి తడిసి నల్లబడిపోయింది. చాలాచోట్ల పత్తిపొలాలు నేటికీ నీటిలో మునిగి కనిపిస్తున్నాయి. పత్తి మూడు క్వింటాళ్లకు పడిపోయింది.

# విజయభాను సంపాదకీయం

## ఆట షురూ!

ఇటీవల ఒకవైపు సౌదీ అరేబియాను ఎగేసిన అమెరికా అనతికాలంలోనే ఖతార్‌కు ఆయుధాలను అమ్ముకున్నది. త్వరలో అమెరికా అధ్యక్షు డు ట్రంప్ పన్నెండు రోజుల పాటు ఐదు దేశాల పర్యటనలో భాగంగా చైనా కూడా సందర్శించనున్నారు. వన్‌బెల్ట్ వన్‌రోడ్‌పై సమావేశాన్ని భారత్ బహిష్కరిస్తే, అమెరికా మాత్రం తమ బృందాన్ని పంపింది. అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిలర్‌సన్ ఇటీవల భారత్‌తో సంబంధ బాంధవ్యాలపై వ్యూహాత్మక, అంతర్జాతీయ అధ్యయనాల కేంద్రం మేధోబృందాన్ని ఉద్దేశించి చేసిన ప్రసంగం అత్యంత కీలకమైనది. ఈ ప్రసంగం భవిష్యత్తులో అమెరికా ఆసియా విధానానికి, ఇండో పసిఫిక్ ప్రాంతంలో అనుసరించే వ్యూహానికి దిక్సూచి వంటిది. అఫ్ఘానిస్థాన్ సంక్షోభం మొదలుకొని వన్‌బెల్ట్ వన్ రోడ్ వంటి అనేక అంశాలపై అమెరికా విధానానికి ప్రాతిపదికను ఇస్తున్నది. రాబోయే రోజుల్లో అమెరికా పశ్చిమ తీరం మొదలుకొని హిందు మహా సముద్ర జలాల వరకు చైనా విసిరే సవాలుకు దీటుగా భారత్‌ను ఉపయోగించుకుంటామని అమెరికా విదేశాంగ మం త్రి నిర్ద్వంద్వంగా తన ప్రసంగం ద్వారా స్పష్టం చేశారు. టిలర్‌సన్ వెల్లడించిన విధానం కొత్తదేమీ కాదు. ట్రంప్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా అనేక సందర్భాలలో స్పష్టంగా వివరించినదే. ట్రంప్ స్వయంగా గత ఆగస్ట్‌లో దక్షిణాసియా విధానాన్ని వెల్లడించారు. అయితే టిలర్‌సన్ ఈ ప్రసంగం చేసిన సందర్భం, చెప్పిన తీరు గమనార్హమైనది. టిలర్‌సన్ చైనా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా తప్పు పట్టారు. భారత్‌తో వందేండ్ల దోస్తీకి బాట వేసుకుంటున్నామని తెలిపారు. చైనాకు వ్యతిరేకంగా భారత్‌ను ఉపయోగించుకుంటామని నిష్కర్షగా చెప్పారు. టిలర్‌సన్ ప్రసంగం తరువాత అమెరికా విదేశాంగ శాఖ అధికారి మరింత వివరణ ఇస్తూ, ఈ ప్రసంగాన్ని ప్రపంచమంతా వింటుందని కూడా అన్నారు. భారత్‌తో తాము నెలకొల్పకోబో యే అనుబంధాన్ని అమెరికా ఘంటాపథంగా చెప్పదలచుకున్నది. చైనా వంటి కొన్ని దేశాలకు ఇది హెచ్చరిక, మిత్రదేశాలకు సూచన. చైనాను తాము ఎందుకు వ్యతిరేకిస్తున్నదీ, ఎందుకు భారత్‌ను అక్కున చేర్చుకుంటున్నదీ టిలర్‌సన్ సందేహాతీతంగా స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు తాము చైనాకు మద్దతు ఇచ్చామ ని, భారత్‌కు తోడ్పడ్డామనీ, కానీ రెండు దేశాలూ వేర్వేరు విధాలుగా ఎదిగాయని ఆయన వివరించారు. భారత్ వంటి దేశాలు నియమబద్ధ విధానాలను పాటిస్తూ ఉంటూ, చైనా మాత్రం అంతర్జాతీయ నియమబద్ధ వ్యవస్థకు భంగకరంగా వ్యవహరిస్తున్నదని టిలర్‌సన్ ఆరోపించా రు. చైనా తన పెట్టుబడులతో ఇతర దేశాల సార్వభౌమత్వానికి ముప్పు తెస్తున్నదనీ, దానికి తిప్పికొట్టాలని అమెరికా భావిస్తున్నది. ఇందుకోసం రెండు నెలల కిందటే ఆసియాలోని కొన్ని దేశాలతో సంప్రదింపులు జరిపింది. దీనికి కొనసాగంపుగానే టిలర్‌సన్ ప్రసంగం ఉన్నది. జపాన్, ఆస్ట్రేలియా, భారత్‌తో కలిసి నాలుగుదేశాల కూటమిని ఏర్పాటు చేయాలని అమెరికా భావిస్తున్నది. భారత్‌తో సం బంధాలను నాటకీయంగా గాఢతరం చేసుకుంటామని, ఇందులో సైనిక రంగం కూడా ఉందని టిలర్‌సన్ అంటున్నారు. నమ్మకమైన మిత్ర దేశాలకు మాత్రమే అందజేసే అత్యాధునిక పరిజ్ఞానంతో చేసిన ఆయుధ సామాగ్రిని భారత్‌కు సరఫరా చేస్తామని ఆయన ఆయన తమ ప్రసంగంలో వివరించా రు. ఇవాళ అంతర్జాతీయ పరిస్థితి అత్యంత అనిశ్చితంగా ఉందనే విషయం గుర్తు చేస్తూ, ఈ పరిస్థితులలో భారత్‌కు ఒక నమ్మదగిన భాగస్వామి కావాలె. అటువంటి భాగస్వామ్య దేశమే అమెరి కా అని టిలర్‌సన్ సూచించారు. రెండు దేశాలకు ఒకే విలువలు ఉన్నాయి, ప్రపంచ సుస్థిరత, శాంతి సౌభాగ్యాల విషయంలో రెండు దేశాల దృక్పథాలు ఒక్కటే అని ఆయన వివరించారు. రెండు దేశాల మైత్రి అమెరికాకే కాదు, భారత్‌కూ అవసరమే అని టిలర్‌సన్ వివరించారు. ఆర్థి క, సాంస్కృతిక, దౌత్య, భద్రతాపరమైన రంగాలలో రెండు దేశాలు ఉమ్మడిగా వ్యవహరించాలని అమెరికా భారత్‌కు సూచిస్తున్నది. టిలర్‌సన్ తన విదేశాంగ పర్యటనలలో భాగంగా వచ్చేవారం పాకిస్థాన్ మీదుగా భారత్ సందర్శిస్తున్నారు. టిలర్‌సన్ పర్యటన సందర్భంగా చర్చానీయాంశాల కోసం భారత్‌లో యంత్రాంగం సమాయత్తం కావలసి ఉన్నది. టిలర్‌సన్ ప్రసంగం ద్వారా అమెరికా భారత్‌తో మైత్రి విషయమై కావాలనే చాటింపు వేసి చెప్పింది. అయితే భారత్ వైఖరి ఏ విధంగా ఉండాలనేది మన దేశ వ్యూహకర్తలు చర్చించుకోవలసి ఉన్నది. భారత్ ఒకప్పుడు సోవియెట్ యూనియన్‌తో ఎట్లా చెలిమి చేసిందో, ఇప్పుడు అమెరికాకు అంత దగ్గరగా మారిందనేది స్పష్టం. అయితే టిలర్‌సన్ చెప్పినట్టు అంతర్జాతీయ పరిస్థితి అత్యంత సంక్లిష్టంగా ఉన్నది. మారిన పరిస్థితికి అనుగుణంగా మన దేశం దౌత్యనీతిని అలవరుచుకోవాలె.

# కాళీ నిమజ్జనాలు ప్రారంభం

కటక్: ఐదు రోజులుగా పూజా మండపాల్లో పూజలు జరిపిన కాళీ ప్రతిమల నిమజ్జనాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం పూట ప్రతిమలను మండపాల నుంచి బయటకు తీసుకొచ్చి వాహనాలపై ఉంచారు. ప్రతిమలకు వెండి, బంగారు ఆభరణాలు అలంకరించారు. తొలుత భాజాభజంత్రీలతో తమ తమ కూడళ్లలో వూరేగించారు. అనంతరం ప్రతిమలను పూజా మండపాల వద్ద నిలిపివేశారు. మధ్యాహ్నం మళ్లీ ప్రధాన మార్గంలో వూరేగింపు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాయిద్య బ ృందాలు, జెండాలు, రకరకాల వేషధారణతో న ృత్యాలు వూరేగింపులను ఆకర్షణీయంగా మార్చాయి. ప్రధాన మార్గం నుంచి వూరేగింపులు చాందినీచౌకు కమిటీ వద్దకు చేరుకున్నాయి. అనంతరం పూరీఘాట్, దేవీఘాట్‌ల వద్దకు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కృతిమ పుష్కరిణిల్లో ప్రతిమలను నిమజ్జనం చేశారు. నగరంలో 60కి పైగా ప్రతిమలను వూరేగించారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. డీసీపీ అఖిలేశ్వర్ సింగ్ అందించిన వివరాల ప్రకారం 25ప్లాటూన్ల బలగాలు, పోలీసు అధికారులు, ఎస్ఓజీలు, స్వీప్ యాక్షన్ బలగాలను కాపలాలో ఉంచామన్నారు.



ప్రధాన మార్గాలతో పాటు నిమజ్జనాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పరిస్థితిపై నిఘా సారిస్తున్నామని తెలిపారు.

# ఆరోగ్య తారక మంత్రం.. నడకే



ఆరోగ్యం కోసం కొందరు జాగింగ్ చేస్తే.. ఇంకొందరు పరుగెత్తుతారు.. మరికొందరు సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, యోగా.. ఇలా రకరకాల పనులు చేస్తుంటారు. మరి వీటన్నింటిలో ఏది బెటర్? బాడీబిల్డింగ్ లాంటి ప్రత్యేకమైన లక్ష్యాలేవీ లేకపోతే నిండైన ఆరోగ్యానికి నడకకు మించిన తారకమంత్రం లేదు అంటోంది అమెరికాలో తాజాగా ముగిసిన ఓ అధ్యయనం. డాక్టర్లు సూచించినంత కాకపోయినా అందులో కొంతైనా నడిచినా.. ఏ వ్యాయామమూ చేయనివారి కంటే ఎక్కువ కాలం జీవించవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.

ఒక అంచనా ప్రకారం వారానికి 150 నిమిషాలు అంటే రోజుకు 20-25 నిమిషాల పాటు నడిచినా లేదా రోజుకు 10-12 నిమిషాలు వేగంగా నడవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని చెబుతున్నారు. అమెరికాలో కేన్సర్ ప్రివెన్షన్ స్టడీస్-2 న్యూట్రిషన్ కోహర్ట్ అధ్యయనంలో పాల్గొన్న దాదాపు 1.4 లక్షల మంది వివరాలను అల్పా పటేల్ అనే శాస్త్రవేత్త విశ్లేషించారు. ఏ రకమైన వ్యాయామం చేయని వారు ఇందులో దాదాపు ఐదు శాతం ఉంటే మిగిలిన వారు కొద్దోగొప్పో వ్యాయామం చేసేవారున్నారు. ధూమపానం, ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యలను పక్కనబెట్టి పరిశీలించినప్పుడు వారానికి రెండు గంటల కంటే తక్కువ నడక సాగించే వారు కూడా ఎక్కువ కాలం జీవించేందుకు అవకాశాలున్నట్లు తెలిసింది.

# షింజో అబేకే మళ్లీ పట్టం!




టోక్యో: ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగిన జపాన్‌లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని షింజో అబే ఘన విజయం సాధిస్తారని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. లాన్ తుపాను వల్ల భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ బూత్‌లకు చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. షింజో అబేకే జపాన్ ప్రజలు మళ్లీ పట్టంగట్టనున్నారని ఎన్నికలకు ముందు కూడా పలు సర్వేలు స్పష్టం చేశాయి. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా జపాన్‌కు అత్యంత ఎక్కువకాలం ప్రధాన మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా షింజో అబే నిలవనున్నారు.

జపాన్ పార్లమెంటులో మొత్తం 465 స్థానాలుండగా, 311 సీట్లను షింజో అబేకు చెందిన లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ (ఎల్‌డీపీ) నేత ృత్వంలోని కూటమి గెలుచుకోనుందని టీబీఎస్ అనే ఓ వార్తా చానల్ వెల్లడించింది. అబేకు మూడింట రెండొంతుల ఆధిక్యం (310 సీట్లు) లభిస్తే జపాన్ రాజ్యాంగంలోని 9వ అధికరణానికి సవరణలు చేసేందుకు అవకాశం కలుగుతుంది. 9వ అధికరణం ప్రకారం జపాన్ ఏ యుద్ధంలోనూ పాల్గొనకూడదు. యుద్ధమే లేనప్పుడు సైన్యం అవసరం లేదు. కాబట్టి జపాన్‌కు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో సైన్యం లేదు కానీ అతికొద్ది మందితో ఆత్మ రక్షణ దళాన్ని మాత్రం ఆ దేశం ప్రస్తుతం నిర్వహిస్తోంది. ఉత్తర కొరియా కయ్యానికి కాలు దువ్వుతున్న నేపథ్యంలో 9వ అధికరణానికి సవరణలు చేయడం ద్వారా జపాన్‌కు సొంతంగా మిలిటరీని ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. కాగా, సాధారణం కన్నా ఒక ఏడాది ముందుగానే ఎన్నికలకు పిలుపునిచ్చి షింజో అబే అందరినీ ఆశ్చర్య పరిచారు.

దేశంలో వ ృద్ధుల సంఖ్య పెరిగిపోతుండటం, ఉత్తర కొరియా అణుపరీక్షలతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో పాటు ఆర్థిక వ్యవస్థకు కొత్త శక్తిని ఇచ్చేందుకు మళ్లీ తనకే ఓటు వేయాలని షింజో అబే ఎన్నికల ప్రచారంలో ప్రజలను కోరారు. ఆయనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీచేస్తున్న కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రాటిక్ పార్టీ (సీడీపీ), పార్టీ ఆఫ్ హోప్‌లు సరైన పోటీని కూడా ఇవ్వలేకపోయాయి. ఈ రెండు పార్టీలనూ కొన్ని వారాల క్రితమే స్థాపించారు.

పార్టీ ఆఫ్ హోప్‌కు 50 సీట్లు, సీడీపీకి 58 సీట్లు దక్కనున్నాయని టీబీఎస్ అంచనా వేసింది.అబేదే విజయమని సర్వేలు చెబుతున్నప్పటికీ జపాన్‌లో ఆయనను విమర్శించేవారూ ఎక్కువగానే ఉన్నారు. అబే ప్రభుత్వంలో బయటపడిన కుంభకోణాలపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆయన ముందస్తు ఎన్నికలు నిర్వహించారని పలువురు పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ వెలువడిన అనంతరం ప్రధాని షింజో అబే మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో చెప్పిన దాని ప్రకారమే ఉత్తర కొరియాపై కఠినంగా వ్యవహరిస్తానన్నారు. రాజ్యాంగ సవరణపై పార్లమెంటులో చర్చిస్తామని, ఎక్కువ మంది మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తానని అబే పేర్కొన్నారు.

# కవి సమయం

## 'పెళ్లి చూపులు'

మనసు పడ్డాను గాని  
మగువను గెలువలేకపోయా!  
మనసు నిండా కొలువైపోయె  
వాట్‌సాఫ్‌లో ఫోటో చూశాను గాని  
అనుకున్న వేళకు పెళ్లిచూపులకు చేరలేకపోయా!  
మేనత్త కొడుకునా నేను  
ఎమౌతానని నేను!  
కుమ్మరకుండను ఎంతమందైనా!  
వాగిస్తారట  
ఎవరికి దక్కాలో వారికే దక్కుతుందని  
వచ్చేవారికి కాదనకుండా చూపిస్తారట... ॥మనసు॥  
వారాలు - వర్జాలు  
శూన్యమాసాలంటూ;  
జాప్యమైయింది కొంత  
సెలవులు దొరకక జాప్యమైయింది  
మరికొంత  
మంచిరోజులని  
ఎక్కి, ఎక్కి పెళ్లిచూపులకై  
విమానములో వస్తే;  
మరి రావద్దు  
ఎదో సంబంధం నలుగుతుందన్న వార్త... ॥మనసు॥  
ఓడిపోయె మేఘమా!  
ఉరుములేందుకే;  
ఏడ్వలేని ఏడ్పు ఏడ్పు కాదే;  
నవ్వలేని నవ్వు నవ్వు కాదే;  
పెళ్లి పీటల మీద పెళ్లిలులే తప్పిపోతున్నాయే  
అంత దానికోసం చింత ఎందుకే మనసా!  
మనసు సంచలనమే కాదా! వాచీ ముళ్లలా!  
రంజులాంటి రంభ ఉందిగా!  
అది తప్పితే;  
వెన్నెల లాంటి -ఊర్వశి ఉందిగా!  
అది తప్పితే;  
మత్తెకించే - మేనక ఉందిగా!  
అది తప్పితే;  
మేనమామ కూతురు- త్రిలోత్తమ ఉందిగా!  
సంజాయించుకున్నా!... ॥మనసు॥

...కవితా రచన  
ఎల్.సిద్ధూ  
సెల్ నెం: 7702977293

# పంచాంగం

| మాసం : కార్తీక శు. పంచమి పూర్తి; జ్యేష్ఠ సా.4.23; రా.వ.1.15ల 3.01 | మంగళవారం 24-10-2017 |
|---|---|

**మేషం** : భాగస్వామికుల మధ్య కొత్త విషయాలు చర్చకు వస్తాయి. **వృషభం** : స్త్రీలకు తల, మెడ, నడుము, నరాలకు సంబంధించిన చికాకులు ఎదుర్కొనక తప్పదు. రావలసిన ధనం సకాలంలో అందుట వలన పొదుపు దిశగా మీ ఆలోచన లుంటాయి. వృత్తి వ్యాపారులకు శ్రమాధిక్యత మినహా ఆశించినంత పురోభివృద్ధి ఉండదు. **మిథునం** :విద్యార్థులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో మంచి గుర్తింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాలు, మీ పాత సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. స్త్రీలకు స్వీయ ఆర్జన పట్ల ఆసక్తి అందుకు తగిన ప్రోత్సాహం లభిస్తాయి. బంధుమిత్రుల రాకపోకలు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుస్తుంది. **కర్కాటకం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల పట్ల ఓర్పు, నేర్పు వ్యవహరించ వలసివస్తుంది. యాదృచ్ఛికంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. **సింహం** : మొక్కుబడులు తీర్చుకోవాలనే మీ సంకల్పం నెర వేరుతుంది. రిప్రజెంటేటివ్‌లు, కొబ్బరి పండ్లు, పూలు కూరగాయలు, చిరు వ్యాపా రులకు లాభదాయకంగా ఉంటుంది. బంధువుల నుంచి ఒత్తిడి, మొహమాటాలు ఎదుర్కొంటారు. ఎదుటివారిని అతిగా విశ్వసించటం మంచిది కాదని గమనించండి.. **కన్య** : నిరు ద్యోగులకు ఇంటర్వ్యూల్లో ఏకాగ్రత ముఖ్యం. హోటల్, కేటరింగ్ రంగాలవారికి లాభదాయకంగా ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో ఎదుటివారిని సలహా అడగడం మంచిదని గమనించండి. మీ జీవిత భాగస్వామి సలహా పాటించి లబ్ధి పొందుతారు. **తుల** : విందులు, దైవ పుణ్యకార్యాల్లో పాల్గొంటారు. స్త్రీలు దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. **వృశ్చికం** : ప్రైవేట్ సంస్థలలోని వారికి విదేశాలు వెళ్ళే అవకాశం లభిస్తుంది. స్త్రీలు విలువైన వస్తువులు చేజార్చుకునే ఆస్కారం ఉంది. ప్రముఖుల సహకారంతో మీ సమస్య పరిష్కారమవుతాయి. ఇళ్ల స్థలాలు, పొలాల అమ్మకంలో పునరాలోచన మంచిది. **ధనుస్సు** : విద్యార్థులు ఉపాధ్యాయులతో ఏకీభవించలేకపోతారు. పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. వహించండి. **మకరం** : చిన్నచూపు చూసిన వారే మీ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు. **కుంభం** :నూతన ప్రదేశ సందర్శనలు ఉల్లాసా న్నిస్తాయి. సాహస కృత్యాలకు, వాదోపవాదాలకు ఇది సమయం కాదని గమనించండి. **మీనం** :వ్యాపారాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తారు. ఖర్చులు, చెల్లింపులలో ఏకాగ్రత వహిం చండి. అర్థాంతరంగా నిలిపి వేసిన పునః ప్రారంభ మవుతాయి.పెద్దల ఆరోగ్యం గురించి ఆందోళన కలిగిస్తుంది.

# భక్తుల పాలిట పెన్నిధి కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి

## సంకీర్తన

శ్రీఆంజనేయస్వామి భక్తులపాలిట పెన్నిధి. నిత్యం రామ ధ్యానంలో వుండే ఆయనను స్మరిస్తే అన్ని రకాల భూత, ప్రేత, పిశాచ భయాలను పోగొడతాడు. ధ్యానముద్రలో స్వయంభువుగా వెలిసిన శ్రీ ఆంజనేయస్వామి అవతరించిన క్షేత్రమే హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆలయం. వందల ఏళ్ల నుంచి భక్తులను దీవిస్తూ ధ్యానముద్రలో వున్న అంజ నాసుతుని దర్శనాన్ని చేసుకుంటే అన్ని రకాలుగా మంచి ఫలితాలు లభిస్తాయి.

ముఖ్యంగా సంతానం లేనివారు స్వామిని దర్శించి నిండుమనస్సుతో ప్రార్థిస్తే సంతానం కలుగుతుందని పెద్దలు చెబుతారు.

రెండో ప్రతాపరుద్రునికి దర్శనం..

క్రీ.శ. 1148లో కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించే రెండో ప్రతాపరుద్రుడు వేటాడుతూ అలసి ఇక్కడ ఒక రాయిపై విశ్రమిస్తాడు. కాసేపటికి అతనికి పులి గాండ్రింపు శబ్దాలు వినిపించడంతో అప్రమత్తుడ్కై విల్లంబులు ధరించి అక్కడకు వెళుతాడు.

అక్కడ ఏమి కనిపించకపోవడంతో తిరిగి రాయి వద్దకు వస్తాడు. మళ్లీ పులి గాండ్రింపు వినరావడంతో తిరిగి గాలిస్తాడు. అప్పుడు కూడా ఎలాంటి జంతువు కనిపించలేదు. అదే సమయంలో రామశబ్దం రావడంతో చేతులు జోడించి ఆ అద ృశ్యమూర్తిని ప్రార్థిస్తాడు. ధ్యానం చేస్తే దర్శనమిస్తానని ఆ మూర్తి స్వరం వినిపిస్తుంది. దీంతో రాజు అక్కడ ఏకాగ్రతతో ధ్యానం చేస్తాడు. కొద్దిసేపటికి ఇక లే నాయనా అంటూ స్వరం వినిపించడంతో రాజు కళ్లు తెరిచి ఆ శబ్దం వచ్చిన చోట వెతకగా ధ్యానాంజ నేయస్వామి విగ్రహం లభ్యమైంది.

పరమానందభరితుడ్కైన రాజు ఆ విగ్రహానికి పూజలు చేసి కోటకు తిరిగి వెళ్లిపోతాడు. ఆ రాత్రి కలలో స్వామివారు అతనికి ప్రత్యక్షమై తనకు ఆలయం నిర్మించమని ఆదేశిస్తారు. స్వామి అనుజ్ఞ ప్రకారం ఆలయాన్ని నిర్మించినట్టు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. స్వామివారిని అనం తరం కాకతీయ రాజులందరూ ఇష్టదైవంగా పూజించడంతో క్షేత్ర మహిమ అన్ని ప్రాంతాలకు వ్యాపించడంతో భక్తులు వేల సంఖ్యలో స్వామి దర్శనానికి వచ్చేవారు.


స్వామివారే హెచ్చరించారు..

17వ శతాబ్దంలో గోల్కొండ సామ్రాజ్యాన్ని మొగల్ పాలకుడు ఔరంగజేబ్ స్వాధీనం చేసుకున్నాడు. అతని సైన్యంలోని కొందరు ధ్యానాంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకొని ఆలయాన్ని ధ్వంసం చేసేందుకు యత్నించారు. అయితే స్వామి దివ్యశక్తితో వారు విజయం సాధించ లేకపోయారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఔరంగజేబ్ స్వయంగా దాడికి దిగాడు. ఈ క్రమంలో ఆలయం వద్దకు చేరుకోగా ఆలయం నుంచి పెద్ద స్వరంతో 'మందిర్ తోడ్‌నా హైతో పహలె తుమ్ కరో మన్‌ఘట్'(ఆలయాన్ని ధ్వంసం చేయాలనుకుంటే మనస్సును గట్టిగా చేసుకో) అని పలికింది. దీంతో ఔరంగజేబ్ తనకు కనపడమని కోరగా తాటిచెట్టు కంటే ఎత్తైన రూపం కనిపించడంతో అతను భీతిల్లి వెనుదిరిగాడు. కరో మన్‌ఘట్ అన్న పేరే కర్మన్‌ఘాట్‌గా మారింది.

నిత్యపూజలు

స్వామివారి ఆలయంలో నిత్యపూజలు జరుగుతుంటాయి. రోజూ వందలాది మంది భక్తులు స్వామి వారి దర్శనం కోసం వస్తుంటారు. ఈ ఆలయ ప్రాంగణంలో పలు ఉపాలయాలను నిర్మించారు.

ప్రశాంతమైన వాతా వరణంలో వుండే ఆలయంలో స్వామివారి మూలవిరాట్ విగ్రహాన్ని దర్శించుకుంటే



మనసుకు ప్రశాంతత చేకూరు తుంది. కొత్తగా కొనుగోలు చేసిన మోటార్ వాహనాలకు ఇక్కడ పూజ చేయిం చడం సంప్రదాయం. నిత్యం అనేక వాహనాలకు శకట పూజ జరుగుతుంది.

ఇలా చేరుకోవచ్చు

హైదరాబాద్ నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఆలయం వుంది. దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్‌ల నుంచి చేరుకోవచ్చు.

మీర్‌పేట్, జిల్లెల్లగూడ, నాదర్‌గుల్, ఆర్.ఎన్.రెడ్డినగర్...తదితర శివారు ప్రాంతాలకు వెళ్లే సిటీ సర్వీసులు కర్మన్‌ఘాట్ మీదుగానే వెళుతాయి.

# రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్
## అండర్- 14 విజేతలు నిజామాబాద్, రంగారెడ్డి



వేల్పూర్ : వేల్పూర్ మినీస్టేడియంలో గత మూడు రోజులుగా కొనసాగిన వేముల సురేందర్ రెడ్డి స్మారక రాష్ట్రస్థాయి అండర్-14 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్, అండర్-17 షటింగ్ బాల్ పోటీలు ముగిశాయి. బాలుర విభాగంలో నిజామాబాద్, బాలికల విభాగంలో రంగారెడ్డి జట్లు విజేతలుగా నిలిచాయి. ద్వితీయ స్థానంలో బాలురలో రంగారెడ్డి, బాలికల విభాగంలో నిజామాబాద్, తృతీయ స్థానంలో బాలురలో ఖమ్మం, బాలికల విభాగంలో హైదరాబాద్ జట్లు నిలిచాయి. తొలిసారిగా నిజామాబాద్ జట్టు బాస్కెట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవడంతో క్రీడాకారులు, శిక్షకులు సంబరాలు జరుపుకున్నారు. లీగ్, ఫైనల్లో హైదరాబాద్, రంగారెడ్డి జట్లను సైతం ఓడించి విజేతగా నిలవడం విశేషం.

రాష్ట్రస్థాయి షటింగ్ బాల్ అండర్-17 బాలుర విభాగంలో రంగారెడ్డి, బాలికల విభాగంలో నిజామాబాద్ జట్లు విజేతగా నిలిచాయి. ద్వితీయ స్థానం బాలుర విభాగంలో నిజామాబాద్, తృతీయ స్థానంలో నల్గొండ జట్లు నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమానికి అఖిత భారత బీడీ కార్మికుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు లోకా భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

గెలుపొందిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి నీరడి భాగ్య, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రెగుల్ల రాము లు, వెంకటాపూర్ సర్పంచి రవి, స్కూల్‌గెమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పవన్‌కుమార్, మండల విద్యాధికారి లింగ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గీత వృత్తిని పరిరక్షించాలి

భిక్కనూరు : కల్లుగీత వృత్తిని సంరక్షించడానికి ప్రభుత్వం రూ. 5 వేల కోట్లు కేటాయించాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైదగాని వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆయన మండలకేంద్రంలో గౌడసంఘం మహాసభల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో లక్షాల కుటుంబాలు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. అలాంటి వృత్తిని ఆధునికీకరించడానికి ప్రభుత్వం చొరవ చూపించి నిధులు విడుదల చేయాలన్నారు. తెరాస ప్రభుత్వం కొలువుదీరి మూడేళ్లు గడుస్తున్నా గీత కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఒక వైపు మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తూ తమ వృత్తిని నాశనం చేస్తోందని ఆరోపించారు. కల్తీ కల్లు పేరిట ఆబ్కారీ దాడులు పెరిగిపోయాయన్నారు. ఈత వనాలు పెంచడానికి ప్రతి గ్రామంలో పది ఎకరాల భూమి ఇవ్వాలన్నారు. ఈ నెల 29న జరిగే గౌడ మహాసభలకు గౌడలు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు స్వామిగౌడ్, కనకగౌడ్, పెద్దస్వామిగౌడ్, చిన్నస్వామిగౌడ్, ఎల్లాగౌడ్, గంగాగౌడ్, రాజలింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అహింసకు మించిన ధర్మం లేదు
## పిరమిడ్ ధ్యాన సంస్థ ఉమ్మడి జిల్లా పోషకులు వైడీ గుప్తా

మహబూబ్‌నగర్ : అహింసకు మించిన ధర్మం మరోటి లేదని పిరమిడ్ సంస్థ ఉమ్మడి జిల్లా పోషకులు వైడీ గుప్తా అన్నారు. మహబూబ్ నగర్‌లోని అంబేడ్కర్ కళాభవన్‌లో మహాకరుణ సదస్సు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పిరమిడ్ ఆధ్యాత్మిక సంస్థ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైడీ గుప్తా మాట్లాడుతూ.. అహింసా పరమో ధర్మ అన్న నానుడి ప్రకారం ప్రతిఒక్కరు జీవించాలని ఆకాంక్షించారు. శాకాహార సమాజ స్థాపనలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకులు సుభాష్ పత్రీజీ నేతృత్వంలో పిరమిడ్ కేంద్రాలు నెలకొల్పి ధ్యానం గొప్పదనాన్ని చాటుతున్నారని పేర్కొన్నారు.

శాకాహార జగత్ పేరిట రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడ్తాల్ పిరమిడ్ ధ్యానశిబిరం కార్యదర్శి ఎస్ఆర్ ప్రేమయ్య, ఖమ్మం పిరమిడ్ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ప్రసాద్ మాట్లాడుతూ పిరమిడ్ ధ్యానంతో మానసిక ఆందోళన, ఒత్తిడిని జయించవచ్చని పేర్కొన్నారు. వయసుతో నిమి త్తం లేకుండా ధ్యానం చేయవచ్చన్నారు. పూరూ రా పిరమిడ్ ధ్యానాన్ని విస్తరించేలా కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జీవహింస చేయరాదు, ప్రతి పక్షి, జంతువును రక్షిద్దామంటూ నినాదాలతో పిరమిడ్ ధ్యాన సంస్థ సభ్యులు చేపట్టిన శాకాహార మహార్యాలీ ఆకటుకుంది. మధ్యాహ్నం తెలంగాణ చౌరస్తాలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.నటరాజ్, పి.రంగారావు జెండా వూపి ర్యాలీని ప్రారంభించారు. ఎర్రసత్యం చౌరస్తా, రైల్వేస్టేషన్, న్యూటౌన్, కొత్తబస్టాండ్, గడియారం చౌరస్తా మీదుగా అంబేడ్కర్ కళాభవన్ చేరుకున్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు పిరమిడ్ సంస్థ అధ్యక్షురాలు కసిరెడ్డి జ్యోతి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగారెడ్డి, జి.వీరేశం, ఉపాధ్యక్షుడు జగదీశ్, కోశాధికారి ధనుంజయ్, శంకరానంద్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఈవోల జిల్లా కార్యవర్గం ఎన్నిక

మహబూబ్‌నగర్ : వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) జిల్లా కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏఈవోల సమావేశంలో అధ్యక్షుడిగా కె.కృష్ణకాంత్, ప్రధాన కార్యదర్శిగా ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రమేష్, కోశాధికారిగా సునీత ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, తంపా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, నాయకులు సురేష్, రాము, రాంపాల్, శ్రీనివాసులు వ్యవహరించారు.

# కన్నుల పండువగా వరాల లక్ష్మీనరసింహుడి కల్యాణం

మాచారెడ్డి : మాచారెడ్డి మండలం లచ్చాపేట శివారులోని వరాల లక్ష్మీనరసింహుడి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులు కల్యాణ శోభతో విరాజిల్లారు. అనంతరం ఉత్సవ మూర్తులకు మంగళ వాయిద్యాలు-మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణం అనంతరం లక్ష్మీసమేతుడైన స్వామి వారికి భక్తులు ఓడిబియ్యాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ ధర్మాచారి, దేవాచారి, నర్సింహాచారి, సంజీవరెడ్డి, గ్రామ సర్పంచి ఆంజనేయులు, నారాగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ లీగ్‌కు పీఈటీ ఎంపిక

ఆర్మూర్ : శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనున్న టీ-20 క్రికెట్ ప్రీమియర్ లీగ్‌కు ఆర్మూర్ మండలం పెర్కిట్ శ్రీభాషిత వ్యాయామ ఉపాధ్యాయులు గురుడు రమేష్ ఎంపికయ్యారు. యునైటెడ్ క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అక్టోబర్ 25 నుంచి 28 వరకు కొలంబో పట్టణంలో జరిగే లీగ్‌లో పాల్గొననున్న రమేష్‌ను శ్రీభాషిత హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి పోలపల్లి సుందర్ శాలువ, పూల మాలతో సన్మానించి రూ. 10 వేల నగదు ప్రోత్సాహం అందించారు. క్రికెట్‌తో పాటు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ఆటల్లో మంచి ప్రావీణ్యం గల రమేష్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం రావడం అభినందనీయమని సుందర్ పేర్కొన్నారు. నవంబర్‌లో ఇంగ్లాండ్‌లో జరిగే కౌంటీ క్రికెట్ మ్యాచ్‌కు ఎంపికవుతాడనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. సన్మాన కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సుందర్, ప్రిన్సిపల్ శైలజశర్మ, పీఆర్వో రజితరెడ్డి, పీఈటీలు నరేష్, స్వరూప, మేనేజర్ సంగ విక్రం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# గొర్రెల కాపరులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే

రామన్నపేట : రైలు ఢీకొట్టిన ఘటనలో గొర్రెల మృతితో నష్టపోయిన గొర్రెల కాపరులను ఆదుకుంటామని ఎమ్మెల్యే వేముల వీరేశం హామీ ఇచ్చారు. రామన్నపేటలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొర్రెల కాపరి లింగమల్లును పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైలు ఢీకొట్టిన ఘటనలో గొర్రెలు మృతితో కాపరులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

ఈ విషయాన్ని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి తగిన సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జీవనోపాధి కోసం గొర్రెలను పంపిణీ చేయటంతో పాటు అవసరమైన రుణ సదుయాపాన్ని కల్పిస్తామన్నారు. గొర్రెల కాపరులపై రైల్వే పోలీసులు నమోదు చేసిన కేసును ఎత్తివేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తెరాస రాష్ట్ర కార్యదర్శి బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బందెల రాములు, కక్కిరేణి విజయ్‌కుమార్, నాసర్, అక్రం, గుత్తా నర్సిరెడ్డి, వనం విఠల్, బొడ్డు సైదులు, చిన్నపాక రమేష్ పాల్గొన్నారు.

గొర్రెల ఖననం : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో మృతి చెందిన గొర్రెలను రైల్వే సిబ్బంది పూడ్చివేశారు. శనివారం సాయంత్రం పల్నాడు ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో గొర్రెలు మృతి చెందాయి.

ఈ విషయం తెలుసుకున్న రైల్వే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టాల వెంట చెల్లాచెదురైన కబేళాలను గొర్రెల కాపరుల సహాయంతో ఒకచోటకు చేర్చారు. మొత్తం 526 గొర్రెలు మృతి చెందినట్లుగా తేలింది. జేసీబీతో తీసిన గుంతలలో గొర్రెల మృతదేహాలను వేసి గుంతలను పూడ్చివేశారు.

# సాగర్‌కు పర్యాటకుల సందడి
## కనీస సౌకర్యాలు లేక పర్యాటకుల ఇబ్బందులు



నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఆదివారం కూడా అధిక సంఖ్యలో వచ్చారు. సాగర్ జలాశయం నిండడంతో నాలుగు రోజులుగా సాగర్ సందర్శించడానికి పర్యాటకులు తరలివస్తున్నారు. పర్యాటకు సంస్థకు చెందిన లాంచీల ద్వారా హిల్‌కాలనీ డౌన్ పార్కు లాంచీస్టేషన్ నుంచి నాగార్జునకొండకు వెళ్లారు. పర్యాటకుల రాక వల్ల సుమారు.1.7లక్షల ఆదాయం వచ్చినట్లు సంస్థ అధికారులు తెలిపారు.

హిల్‌కాలనీ వద్ద పర్యాటక సంస్థ లాంచీ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఏడాది పూర్తయినా నేటికీ ఇక్కడ సౌకర్యాలు కల్పించ లేదు. ముఖ్యంగా పర్యాటకులు కూర్చోవడానికి కనీసం షెడ్లు, బెంచీలు లేకపోవడం వల్ల పర్యాటకులు పార్కులోని చెట్ల నీడలో సేద తీరారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేక పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా పర్యాటక సంస్థ అధికారులు లాంచీ స్టేషన్ వద్ద సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

# బాన్సువాడలో 100 పడకల ప్రసూతి వార్డు

బాన్సువాడ : బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రిలో 100 పడకల ప్రసూతి వార్డు మంజూరైనట్లు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడలో రూ.3.12 కోట్లతో నిర్మించే విత్తనాల గిడ్డంగి, దుకాణసముదాయం పనులను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు రూ.15 లక్షలతో నిర్మించిన కూరగాయల దుకాణ సముదాయం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాన్సువాడకు 100 పడకల మెటర్నటీ వార్డు ఏర్పాటుకు రూ.17 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. బాన్సువాడ ఆసుపత్రికి ఇప్పటికే డయాలిసిస్ సెంటర్, రక్తనిల్వ కేంద్రం, ఐసీయూలు మంజూరైనట్లు తెలిపారు. మెటర్నటీ వార్డు కోసం బాన్సువాడ ప్రాంతీయ ఆసుపత్రి ముందుభాగంలోని డీసీఎమ్ఎస్ స్థలంలో నిర్మించి రోడ్డుకు ఇరువైపుల పోవడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. బాన్సువాడకు ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. రూ.3.12 కోట్లతో నిర్మించే విత్తన గిడ్డంగితో బాన్సువాడలోని రైతులు సగం ధాన్యం ఇక్కడే నిల్వచేసుకోవచ్చని తెలిపారు. బాన్సువాడ మార్కెట్ కమిటీకి 2,500 మెట్రిక్‌టన్నుల గోదాం మంజూరైందన్నారు. బాన్సువాడను మున్సిపాలిటీ మార్చడంతోపాటు ప్రత్యేకంగా సీసీ, మురుగు కాలువల నిర్మాణానికి రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేంద్రయ్య, ఆర్డీవో రాజేశ్వర్, ఏడీఏ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నార్లసురేష్, ఎంపీపీ రేష్మాబేగం, జడ్పీటీసీ జంగం విజయ, సర్పంచి దొనకంటి వాణి తదితరులు పాల్గొన్నారు.

# నియంతృత్వ పాలనకు చరమగీతం పాడుదాం
## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి

తిమ్మాజిపేట : కేంద్రం, రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని, ప్రజలంతా ఏకమై ఈ పాలనకు చరమగీతం పాడుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఐ పోరుబాట కార్యక్రమంలో భాగంగా తిమ్మాజిపేటలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో చాడ మాట్లాడుతూ అటు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, ఇటు రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను మరిచిపోయి మాటల గారడీతో మభ్య పెడుతున్నారని దుయ్యబట్టారు. అధికారం ఉందన్న అహంకారంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సమస్యలను గాలికి వదలి ఇష్టారాజ్యంగా పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. అర్హులకు రెండు పడక గదుల ఇళ్లు, దళితులకు భూ పంపిణీ, కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఇంటికో ఉద్యోగం, పంటల నష్టపరిహారం, పంటల బీమా పథకాలను ముఖ్యమంత్రి పట్టించుకొంటున్న దాఖలాలు లేవు అని, వీటిని అమలును పట్టించుకోని ముఖ్యమంత్రికి ప్రజా సంక్షేమం పట్ల ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మాకు బంగారు తెలంగాణ అవసరం లేదని, బతుకు తెలంగాణ కావాలన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు లభించని పరిస్థితి నెలకొందని, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం శోచనీయమన్నారు. ఉద్యమ సమయంలో పేర్కొన్న నీళ్లు, నిధులు, నియామకాలు, అందరికీ విద్య, వైద్యం అంశాలు ఏమయ్యాయని ప్రశ్నించారు.

అంతకుముందు ఆయన మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సీపీఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఈర్ల నర్సింహ, పద్మ, మల్లేష్, సాయిలు, పాండురంగాచారి, రాములు, అంజయ్య, ఖాజామైనొద్దీన్, నారాయణ, కొమ్ముభరత్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు మల్లన్నసాగర్ నుంచి నీటి మళ్లింపునకు ప్రణాళికలు



**గుంటకండ్ల జగదీష్‌రెడ్డి**

మిర్యాలగూడ : రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో చుక్క నీటికి లెక్కలు గడుతూ ఇంజినీరు అవతారమెత్తిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. తెరాస రాష్ట్ర ప్రధానకార్యదర్శి సోమ భరత్‌కుమార్‌కు మిర్యాలగూడలో ఏర్పాటుచేసిన అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. కృష్ణానది ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంల ఎత్తుపెంపు వల్ల నల్గొండ జిల్లాకు తీరని నష్టం జరుగుతుందని గుర్తించిన సీఎం, గోదావరి నదిపై నిర్మిస్తున్న మల్లన్నసాగర్ జలాలను పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌కు అనుసంధానించే బృహత్ ప్రణాళిక రూపొందిస్తున్నారని చెప్పారు.


గోదావరికి అనుసంధానంగా పారే మూసీ నది ఎత్తు, పరివాహ తీరును...సాగర్ ఎడమ కాల్వ పరిధి, కాల్వ ఎత్తుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించారని వెల్లడించారు. ఎడమ కాల్వకంటే మూసీ నది సుమారు 50 అడుగుల ఎత్తులో పారుతున్నందున గోదావరి జలాలను మూసీనది ద్వారా ఎడమ కాల్వకు మళ్లించే వీలుందని సీఎం గుర్తించినట్లు పేర్కొన్నారు. ఎడమ కాల్వ పరిధిలోని రైతులను ఆదుకునేందుకు అందుకు తగినట్లు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. పెద్దదేవులపల్లి రిజర్వాయర్ పరిధి పెంచి గోదావరి జలాలను అందులోకి మళ్లించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. తద్వారా జిల్లాలోని ఎడమకాల్వల పరిధిలోని రైతులకు రెండు పంటలకు నీరందుతుందన్నారు.

ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ ప్రాజెక్టు మిగులు భూముల్లో డ్రై పోర్టు ఏర్పాటు చేయాలని, ఆదిశగా సీఎం కేసీఆర్‌ను ఒప్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. తెరాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్, కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు మాజీ ఎమ్మెల్యేలు తిప్పన విజయసింహారెడ్డి, రేపాల శ్రీనివాస్, నోముల నర్సింహయ్య, సభ నిర్వహకులు తిరునగరు మారుతీరావు, ఎంసి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రూ.48వేల కోట్లతో ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడలోని ఎంవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు 24 గంటల విద్యుత్తు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా అదనంగా ప్రజాసంక్షేమ పథకాలు ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 450 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద రూ.2.70 కోట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా రూ.7.25 లక్షలు బాధితులకు అందిస్తున్నామన్నారు. పురపాలిక అధ్యక్షురాలు తిరునగరు నాగలక్ష్మి, ఆర్డీవో జగన్నాథరావు, డీఎస్పీ సురభిరాం గోపాల్‌రావు, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి ఎంపీపీలు రవీనా, జానయ్య, మంగమ్మ, జడ్పీటీసీ సభ్యులు శంకర్‌నాయక్, పద్మ, నాగలక్ష్మి, తిరునగరు భార్గవ, చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్లు కృష్ణారెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

# వాగ్దానాలు అమలయ్యే వరకు పోరాటం
## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నల్గొండ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. స్థానిక ఏచూరి గార్డెన్‌లో జరిగిన సీపీఎం రాష్ట్ర ద్వితీయ మహాసభల ఆహ్వాన సంఘం సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని రప్పించి ప్రజల బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ విస్మరించారని పేర్కొన్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్ సచివాలయానికి రాకుండా, ప్రతిపక్షాలకు సమయమివ్వకుండా ఎక్కడో ఉండి ఏం మాట్లాడతారో అర్థం కావటం లేదని ఎద్దేవా చేశారు. సీఎం కొన్నిసార్లు సహనం కోల్పోతున్నారని, అధికారంలో ఉన్నారో, ప్రతిపక్షంలో ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. ధర్నా చౌక్‌ను ఎత్తివేయడం, కోదండరాం స్ఫూర్తి యాత్రలను అడ్డుకోవటం, మిర్చి రైతులకు బేడీలు వేయడం, భూ నిర్వాసితులకు పరిహారం అడిగితే లాఠీఛార్జీలు చేయించటం తెరాస సర్కారుకే చెల్లిందన్నారు. 2018 ఫిబ్రవరిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు, నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, టి.జ్యోతి, బి.వెంకట్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పి.అనంతరామశర్మ, తుమ్మల వీరారెడ్డి, నారీ అయిలయ్య, బండ శ్రీశైలం, డబ్బికార్ మల్లేష్, మామడి సర్వయ్య, సయ్యద్‌హాషం, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లా పార్టీ కార్యదర్శులు ఎండీ జహంగీర్, ములకలపల్లి రాములు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పూలు సువాసనలకే కాదు...
# ఆరోగ్యాన్నీ ఇస్తాయి



పూలు కళ్లకు అందంగా కనిపిస్తాయి. పూలను చూస్తుంటే ఏదో తెలియని ఆనందం, ప్రశాంతత కలుగుతుంది. ఒక్కొక్క పూవుది ఒక్కో సువాసన. పూల రంగు, సువాసనల ప్రభావం మనిషి మీద ఉంటుంది. ఈ పూల రేకులతో, మొక్కలలోని హార్మోన్లు ఉంటాయి. ఇవి మనిషికి మేలు చేసేవి. అందుకే ఔషధాల తయారీలో పూలను వాడుతారు. గులాబీ పూలు మనిషి మూడ్‌ను మారుస్తాయి. ఎంతో విచారంలో ఉన్న వారికి గులాబీలు అందించినట్లయితే వారి మనసులో ఆనందం మొదలవుతుంది. గులాబీల నుండి తీసిన రసాయనాలు మానవ కాలేయం, పిత్తాశయాల పనితీరును మెరుగుపరుస్తాయి.

మేరీగోల్డ్ పూలు యాంటీసెప్టిక్‌గా పనిచేస్తాయి. గాయాలకు రాసే ఆయింట్‌మెంట్లలో ఈ పూలు ఉపయోగిస్తారు. చమేలీ పుష్పాలు పేగు పనితీరును ఎంతగానో మెరుగుపరుస్తాయి. రోగనిరోధక వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. కడుపునొప్పి, నోటిలో నంజు పొక్కు నుండి ఉపశమనం కలిగిస్తుంది. డాంజిలియన్ పూలు రక్తలేమి, కామెర్ల చికిత్సలో వాడుతున్నారు.

## సాధారణ శ్వాసకు ప్రాణాయామానికి తేడా ఏంటి..?

ప్రాణాయామానికి సాధారణ శ్వాసకు తేడాలున్నాయి. సాధారణ శ్వాసలో తక్కువ మోతాదులో ఆక్సిజన్ తీసుకుని, తక్కువ మోతాదులో కార్బన్‌డై ఆక్సైడ్ వదలడం జరుగుతుంది. అదే ప్రాణాయామం విషయానికి వస్తే ఎక్కువ మోతాదులో ఆక్సిజన్ పీల్చుకుని ఎక్కువ మోతాదులో కార్బన్‌డై ఆక్సైడ్ వదులుతాం. సాధారణ శ్వాసక్రియలో శ్వాస తీసుకోవడం వేగంగా జరుగుతుంది. నిమిషానికి పన్నెండు నుంచి పదిహేను వరకూ ఉచ్ఛ్వాస నిశ్వాసాలుంటాయి. అదే ప్రాణాయామంలో శ్వాసక్రియ నిదానంగా జరుగుతుంది. నిమిషానికి ఐదు నుంచి 8 ఉచ్ఛ్వాస నిశ్వాసాలుంటాయి.సాధారణ శ్వాసపై మనకు అదుపు ఉండదు. అది అప్రయత్నంగా జరిగిపోతూ ఉంటుంది. అయితే ప్రాణాయామంలో శ్వాస మీద ప్రత్యేక ధ్యాస ఉంటుంది. ప్రతి మార్పును గమనిస్తూ ఉంటాం. సాధారణ శ్వాస తీసుకునేందుకు ఎటువంటి నిబంధనలు ఉండవు. అదే ప్రాణాయామం చేయడానికి పూరక, కుంభక, రేచక, శూన్యక నియమాలను పాటించడం జరుగుతుంది. సాధారణ శ్వాసలో చింతలూ, చికాకులూ మనల్ని వదిలిపెట్టవు. అదే ప్రాణాయామం విషయానికి వచ్చేసరికి మనలో ఆందోళనలు తగ్గుతాయి. మనసు ప్రశాంతంగా ఉంటుంది. శరీరక, మానసిక సమస్యలు క్రమంగా దూరమవుతాయి.

## చర్మం ముడుతలను తగ్గించే 'ఖర్బూజా పండు'

❍ పావుకప్పు ఖర్బూజా పండు గుజ్జులో రెండు టీస్పూన్ల పాలను కలిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని శుభ్రం చేసుకుంటే చర్మంపైన ముడుతలను తగ్గిస్తుంది. అంతేకాకుండా చర్మం కూడా మృదువుగా తయారవుతుంది.

❍ ఖర్బూజా గింజలను ఎండబెట్టి, గింజలపై పొట్టు తీసివేసి మెత్తగా నూరుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి ప్యాక్‌లా వేసుకోవాలి. తరువాత మెల్లిగా మర్దనా చేసుకున్నట్లయితే చక్కటి స్క్రబ్‌లాగా పనిచేసి శ్వేదగ్రంథులను తెరచుకునేలా చేస్తుంది. దాంతో చర్మం చూడగానే ఇట్టే ఆకట్టుకునేలా మెరిసిపో తుంది.

❍ ఖర్బూజా పండు ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఈ పండును క్రమం తప్ప కుండా తీసుకున్నట్లయితే ఎసిడిటీ, అల్సర్ల నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరంలో లవణాలు, నీటి శాతం తగ్గటంవల్ల వచ్చే మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లను కూడా దూరమవు తాయి. ఈ పండు తొక్కను కషాయంలాగా కాచి కొబ్బరినీటితో కలిపి తీసుకుంటే మూత్ర సంబంధ వ్యాధులు తగ్గుముఖం పడతాయి.

## అత్యంత వేగంగా పెరిగే మొక్క ఏదో తెలుసా!

మొక్కల్లో అత్యంత వేగంగా పెరిగే మొక్క ఏదో ఎంతమందికి తెలుసు? వాటర్ హయసింత్ అనే నీటిమొక్క చాలా వేగంగా పెరుగుతుంది. ఇది దక్షిణ అమెరికా ప్రాంతానికి చెందినదైనా ఇంచుమించు ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించింది. దీనికి గంట ఆకారంలో ఉండే పువ్వులు పూస్తాయి. అందుకే మొదట్లో దీనిని ఇతర ప్రాంతాల వారు కూడా పెంచడానికి ఇష్టపడ్డారని భావిస్తున్నారు. ఈ మొక్కలు చాలా త్వరగా పెరగడంవల్ల వీటి సంఖ్య రెండు వారాల్లోనే రెట్టింపవుతుంది. సరస్సులో వీటి పెరుగుదల పడవ ప్రయాణాలకి, చేపలు పట్టడానికి అడ్డంకిగా మారుతుంది. ఈ మొక్కల వల్ల దోమలకు మంచి నివాసం దొరికి వాటి సంఖ్యతోపాటు వ్యాధులు కూడా పెరుగుతాయి. అందువల్ల వీటిని కలుపు మొక్కలుగా భావించి వీటి నిర్మూలనకి ప్రయత్నిస్తుంటారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జపాన్ పైలట్లు ఈ మొక్కలతో నిండి ఉన్న చెరువులను పొలాలుగా భావించేవారట. దానితో యుద్ధ విమానాలను అక్కడ దించడానికి ప్రయత్నించడంతో అవి కూలిపోయేవట. అందుకే వాటిని జపాన్ జబారా అంటారు.



## వెంట్రుకలు ఎందుకు తెల్లబడతాయి?

అమ్మానాన్నల జుట్టూ, మన జుట్టూ నల్లగా, ఒత్తుగా, నిగనిగలాడుతూ ఉంటాయి. కాని నాయనమ్మ, అమ్మమ్మలు, తాతయ్యల జుట్టు మాత్రం తెల్లగా మెరిసి పోతూ ఉంటుంది. పిల్లలకు మాత్రం నల్లగా ఉండి, ముసలివాళ్లకు మాత్రం జుట్టు తెల్లగా ఉండేందుకు కారణమేంటో తెలుసా. మన వెంట్రుకలు నల్లగా, ఆకర్ష ణీయంగా కనిపించేందుకు ఆయా వ్యక్తుల శరీరంలోని మెలనోసైట్ల కణాలు సహాయం చేస్తుంటాయి. వయసు పెరిగేకొద్దీ ఈ కణాల పని సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. తద్వారా ఫోలికల్స్ నుండి బయటికి వచ్చే వెంట్రుకలకు తక్కువ మోతాదులో సంబంధించిన రసాయనాన్ని అందజేస్తుంది. కాబట్టి వెంట్రుకలు నల్లగా కాకుండా గోధుమరంగులో వస్తాయి. క్రమేణా మెలనోసైట్ల పని పూర్తిగా తగ్గిపోతుంది. ఇలాంటి సందర్భాల్లో వెంట్రుకలు వాటి సహజసిద్ధమైన ప్రొటీన్ రంగులకి అంటే తెలుపు రంగులకి వస్తాయి.




## బొప్పాయితో బోలెడు లాభాలు..!

బొప్పాయి' పండు ఏడాది పొడవునా మనకు విరివిగా లభిస్తుంది. దీన్ని వివిధ రకాల ఔషధాల తయారీలోనూ ఎక్కువగా వాడుతున్నారు. ఉష్ణమండల ప్రదేశాల్లో ఎక్కువగా పండే బొప్పాయి ఆకులు, విత్తనాలు, పాలు మనకు అనేక ఆరోగ్యకర ప్రయోజనాలను కలిగిస్తాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1. చర్మ సంరక్షణకు బొప్పాయి బాగా పనిచేస్తుంది. దీన్ని ముఖానికి ఫేస్‌ప్యాక్‌గా వేసి వాడుకోవచ్చు. ముఖంపై ఏర్పడిన మచ్చలకు, మొటిమలకే కాక, వివిధ చర్మ వ్యాధులకు కూడా ఉపయోగించవచ్చు. చర్మంలో ఏర్పడే మృత కణాలను, మృత చర్మాన్ని పోగొడుతుంది. చర్మం మరింత ప్రకాశించేందుకు బొప్పాయి తోడ్పడుతుంది. వయస్సు మీద పడిన వారిలోనూ ఇది తన ప్రభావాన్ని చూపిస్తుంది. వారి సౌందర్యాన్ని పెంచుతుంది.

2. శరీరంలోని, రక్తకణాలలోని కొవ్వును తీసివేయడంతోపాటు గుండెపోటు



రానీయకుండా చూస్తుంది. శరీరంలో హాని కలిగించే టాక్సిన్లను బొప్పాయి తొలగిస్తుంది. ఇది జీర్ణవ్యవస్థకు చక్కని ఔషధంగా పనిచేస్తుంది. రోజూ బొప్పాయిని మన ఆహారంలో భాగంగా చేసుకుంటే జీర్ణ సమస్యలు తలెత్తవు. మలబద్ధకానికి బొప్పాయి మంచి మందు.

3. విటమిన్ ఎ, సిలు బొప్పాయిలో ఉంటాయి. శరీర రోగ నిరోధక శక్తిని పెంచే గుణాలు బొప్పాయిలో ఉన్నాయి. జ్వరం, జలుబు, ఫ్లూతో బాధపడే వారు దీన్ని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. రోజూ బొప్పాయి తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

4. మహిళల్లో తలెత్తే రుతు సంబంధ సమస్యలను తొలగిస్తుంది. కాలేయ సమస్యలను నివారిస్తుంది. కాలేయంలో ఉండే క్యాన్సర్ కారక క్రిములను నాశనం చేస్తుంది.

5. అధిక బరువు ఉన్నవారు నిత్యం బొప్పాయిని తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. ఇందులో ఉన్న పోషకాలు తక్కువ క్యాలరీలను అందజేస్తాయి. సన్నగా మారాలనే వారికి బొప్పాయి మంచి అవకాశాన్ని కల్పిస్తుంది.

6. చుండ్రు సమస్యతో బాధపడేవారు బొప్పాయి గుజ్జులో నాలుగు చుక్కల నిమ్మరసం, వెనిగర్ కలిపి తలకు పట్టించి గంటయ్యాక తలస్నానం చేస్తే సమస్యకు తగిన పరిష్కారం లభిస్తుంది.



7. పచ్చి బొప్పాయిని మెత్తని ముద్దగా చేసి దాని నుంచి రసం తీసి కొబ్బరి నూనెలో కలపాలి. ఆ నూనెను తలస్నానానికి ముందు రోజు రాస్తే ఫలితం ఉంటుంది.

8. బొప్పాయి, అరటి గుజ్జును సమపాళ్లలో తీసుకుని మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. ఈ మిశ్రమంలో నాలుగు చుక్కల వెనిగర్, కొంత నీరు కలిపి ముఖానికి మర్దనా చేసుకుని కడిగేస్తే చర్మం శుభ్రపడుతుంది. ఇది చక్కని క్లీన్సర్‌గా పనిచేస్తుంది.

9. చర్మం గరుకుగా ఉంటే బొప్పాయి గుజ్జును రాసి కొంత సేపటి తరువాత నీటితో కడిపి మర్దనా చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం మృదుత్వాన్ని పొందుతుంది.

10. బొప్పాయి కలిపిన ముల్తానీ మట్టితో తరచూ పూత వేసుకోవడం వల్ల ముడతల సమస్యను అదుపులో ఉంచుకోవచ్చు.

# అందమే ఆరోగ్యం



ఆనందంగా ఉన్న వారు. ఆత్మవిశ్వాసంతో ఎప్పుడూ శక్తి వంతంగా ఉంటారు. సమాజంలో అందరితో కలిసిమెలసి ఉంటారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితిలోనైనా సంతోషంగా ఉండేవారు సమస్యలను సమర్థతతో ఎదుర్కుంటారు. మనం ఎప్పుడూ సంతోషంగా జీవించడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి.వాటిని పాటించి నట్లైతే ఆరోగ్యాన్ని పెంపొందించుకుని ఆరోగ్యంగా జీవించవచ్చు

జీవితంలో ఆనందకరమైన సంఘటనలు జరిగినా అలాంటి సందర్భాల్లో పాలుపంచుకున్నా ఎంతో హాయిగా ఉన్నట్టు మనసు ఉరకలు వేస్తున్న ట్టు ఉంటుంది. తక్కువ ఆనందంగా ఉండే వారికంటే ఎక్కువ సంతోషంగా ఉన్నవారే ఆరోగ్యంగా ఉంటారు.జీవితాన్ని హాయిగా ఆనందంగా అనుభవించగలరు. సంతోషంగా ఉండడం వల్ల వారి యొక్క లక్ష్యాలను మరింత శక్తి సామర్ధ్యంతో సాధించుకోగలరు. లక్ష్యసాధనలకు చక్కటి మార్గాలను అనుసరిస్తారు.ఆనందమే ఆరోగ్యానికి మారుపేరు అని నిపుణులు తెలుపుతున్నారు.

మీరు ఇతరుల కంటే ఐదు సంవత్సరాల నుండి తొమ్మిది సంవత్సరాలు ఎక్కువగా బతుకుతారు. ఎందుకంటే వీరు అంత ఆరోగ్యంగా ఉంటారు. త్వరగా జబ్బుపడే అవకాశం ఉండదు. రోగనిరోధకశక్తి వ్యవస్థలు ఆరోగ్యంగా ఉంటాయి.ఎటువంటి ఇన్‌ఫెక్షన్‌కైనా తట్టుకునే శక్తి సొంతం చేసుకుంటారు.ఎప్పుడూ అన్ని వేళలా సంతోషంగా ఉండేవారి శరీరంలో ఎండార్ఫిన్స్ బాగా విడుదలై సంతోషాన్ని ఉద్దీపనం చేస్తాయి. దాని ద్వారా ఆరోగ్యం వృద్ధి చెందుతుంది.సంతోషంగా ఉంటే ఎండార్ఫిన్ అధికంగా విడుదలై ఉత్తేజవంతమైన జీవితాన్ని గడపగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.

ఆనందంగా ఉండడం వలన ఒత్తిడి తగ్గుతుంది, ఆరోగ్యం అధికమవుతుంది. ఆత్మవిశ్వాసం ఆత్మస్థైర్యం పెరుగుతాయి. మార్పును త్వరగా స్వీకరిస్తారు. అలసట తగ్గుతుంది. క్లిష్ట సమయాలను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది.ప్రేరణ శక్తి అధికమౌవుతుంది. గాఢ నిద్ర పడుతుంది.

సంతోషానికై. అధిక సంతోషం మెరుగైన ఆరోగ్యం కోసం ఎండార్ఫిన్స్ విడుదలను పెంచడం, నియంత్రించడానికి ఒక విధానాన్ని ఏర్పాటు చేసుకోవాలి. జీవితంలో మనకు ఆనందాన్ని, హాస్యాన్ని కలిగించి హాయిగా నవ్వించి ఉత్తేజపరచగల కొన్ని అంశాలను మనం ఎంచుకోవాలి.మీకు ఇష్టమైన జాబితా ఒకటి రాసుకోండి . అది స్నేహితులతో కలిసి పార్కులకు వెళ్ళాలని దేవాలయాలకు వెళ్ళాలని సినిమాలకు వెళ్ళాలని లేదా ఇంట్లో కూర్చుని స్నేహితుల తో ఆటలాడుకోవాలని, చిన్నప్పుడు జరిగిన చిలిపిపనులు అప్పటి జ్ఞాపకాలను. నెమరు వేసుకుంటూ కబు ర్లు చెప్పుకోవాలని, వారితో కలిసి భోజనం చేస్తూ గడపాలని. ఇలా పలురకాలుగా అనుకుంటారు.ఇలా ఎవరికి ఇష్టమె%న వాటిని వారు ఎంచుకోవచ్చు.

ప్రదేశాల జాబితా... మీరు ముందుగా ఒక పేపరు తీసుకుని మీరు చూడాలనుకున్న స్థలాలు ప్రదేశాలు పర్వతాలు ఎమైనా కావచ్చు. వాటిని ఒక జాబితాగా ఏర్పాటు చేసుకోండి. మీకు సంతోషాన్ని కలిగించే స్థలా లు, మీరు చూడాలనుకున్నవి, చూసినవి, ఇంతవరకూ చూడనివి గుర్తించాలి.

మీరు చూడాలనుకున్నవి నగరం లేదా సము ద్రం, నది, సరస్సు, పుణ్యక్షేత్రాలు, లేదా ప్రసిద్ధిచెందిన కార్యాలయాలు విశ్రాంతి కార్యాలయాలు, మీరు చిన్నప్పు డు పెరిగిన ప్రదేశం, మీకు ఎంతో ఇష్టమైన పంటపొలా లు ఇలా మీకు మరేవైనా గానీ సంతోషాన్ని కలిగించేవి కావాలి.

మధుర జ్ఞాపకాలు...మరిచిపోలేని మీ మధురమైన అనుభవాలు, స్కూల్లో చదువుతున్నరోజుల్లో మీరు చేసిన అల్లరిపనులు తోటి స్నేహితులతో కలిసి క్లాస్‌కి వెళ్లకుండా మామిడ తోటకు వెళ్ళి తోటమాలికి తెలియకుండా కాయలు కోయడం, ఆ తోటలో ఆటలాడుకోవడం, డిగ్రీ పూర్తిచేసిన కాలేజీ రోజుల్లో స్నేహితులతో కలిసి సినిమాల కు వెళ్ళడం, ప్రేమలో పడడం, మీ స్నేహితులు గానీ మీకు ఇష్ట మైన టీచర్‌గానీ మీ తల్లిదండ్రు లుగానీ మీ కోసం ఏవైనా బహుమతు లు కొనిచ్చినప్పుడు మీకు ఆనందం కలిగిన అనుభవాన్ని...ఇలా గుర్తుకుతెచ్చుకొని సరదాగా మాట్లాడుకోవచ్చు. ఇష్టమైన వారు ఇచ్చిన బహుమతులను వారికి గుర్తుగా వాటిని జా గ్రత్తగా దాచుకోవడం అవి చూసినప్పుడు ఆనందాన్ని సైతం పొందవచ్చు.


నచ్చిన పనులు... మీకు నచ్చిన చెట్లు, పుష్పం వాటినుంచి వచ్చే సువాసన సుగంధ ద్రవ్య పరిమళం, వర్షం పడుతున్నప్పుడు వచ్చే వాసన, పండ్లరుచి చాక్లెట్ రుచి, లేదా వైన్, సూర్యాస్తమయం రంగు, నీలి ఆకాశంలో ఎగురుతున్న పక్షులు, అప్పుడే విరబూసిన పండు వెన్నెలలో కూర్చోవడం, సాయంత్రం వేళ చల్లగా వీచే గాలిలో పచ్చని చెట్ల మధ్య ఉయ్యాల ఊగడం, మంచి దుస్తుల రంగులు ఇలా ఏవైనా కావచ్చు. పక్షుల కిలకిలారావాలు, మనం పెంచుకున్న చిలకమ్మ పలుకులు, మీ ఇంట్లో మీతో ఉండే పెంపుడు జం తువులు, మీ చుట్టూ తిరుగుతూ మీపట్ల ఎంతో ప్రేమతో ఉన్న నేస్తాలు, సముద్ర ఘోష, లేదా ఇష్టమైన రాక్ సంగీతం, సంప్రదాయ సంగీతం ఏదైనా కావచ్చు. మీ మనసుకు సంతోషాన్ని, హాయిని గొలిపే అనుభూతిఅంశాల జాబితాను మీరు సిద్ధం చేసుకోండి.

మీకు కావల్సిన ఎండార్ఫిన్స్, ఆనం దం కలిగించే హార్మోన్లు వీటివల్ల విడుదలవుతాయి.ఇంకా మీకు ఆనందాన్ని కలిగించే అంశాలు ఉన్నా కూడా చేర్చుకోవచ్చు. ప్రతి రోజూ మీరు నిర్వహించదగిన కార్యక్రమాలు, మీ ఇంట్లో లేదా ఎక్కడె%నా మీకు నచ్చిన బొమ్మలు,మీకు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మీ పెదాలపై చిరునవ్వు చిందించి, హృదయం పులకింపచేసే సంఘటనలు, మీకు నచ్చిన సంగీతం వినాలన్న పాటలు పాడలంటే వెంటనే పాడేయండి... కథలు, కవిత్వాలు, పుస్తకాలు చదవాలంటే చదవండి. వాటిని ఎట్టి పరిస్థితిలో ఆపకండి. ఎందుకంటే మీకు నచ్చిన, ఇష్టమైన కార్యక్రమాలు ఏవి చేసినా మీలో ఎండార్ఫిన్స్ విడుదలై అవి సంతో షాన్ని ఆధికం చేస్తాయి.

ఇలా ఆచరించండి...అప్పుడప్పుడూ చేయదగిన, చేయాలనుకునే జాబితాలో వాటిని అచరించడానికి అవకాశం కల్పించుకోవాలి. సెలవు రోజులలో పిల్లలతో కలిసి ఎక్కడికైనా వెళ్ళడం. నచ్చిన ప్రదేశాలు పర్వతాలు ఎక్కడం, సంస్కృతిక కార్యక్రమాలు చూడండి. దూరంగా ఉన్న స్నేహితులను కలవడం.వారానికి ఒకసారి బయట కి వెళ్ళి మీకు ఇష్టమైన వాటిని తినడం మీ ఇంట్లో వాళ్ళకు తీసుకొచ్చి ఇవ్వడం, మొక్కలు పెంచడం, అలా ఆరుబయట తిరగడంలాంటివి చేయాలి.ఏమీ చేయకపోవడం కన్నా అప్పుడప్పుడు ఆచరించడం మంచిదే కదా! మనకు నచ్చిన ప్రదేశానికి వెళ్ళినప్పుడు అక్కడి నుండి కొన్ని వస్తువులను తీసుకొస్తూంటాం కదా! వాటిని మీరు ఇళ్ళల్లో దాచుకోవడం లేదా అలంకరిం చుకోవడం చేస్తుంటాము.

రంగు, రుచి, వాసన దృశ్యం, స్పర్శ లాంటి అంతర్భాగాల అమరిక నేరుగా ఎండార్ఫిన్స్ విడుదలను నియంత్రించే మెదడులోని కేంద్రాన్ని తాకుతాయి. అంటే రంగులు సైతం ప్రభావం చూపుతాయి.

# గడ్డం చేసుకుంటే 100 డాలర్లు



వాషింగ్టన్ : పురుషులు గడ్డం చేసుకుంటే 100 డాలర్ల జరిమానా. మహిళలు బిగుతైన వస్త్రాలు ధరిస్తే 25 డాలర్ల పెనాల్టీ. ఐఎస్ ఉగ్రవాదుల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలపై వేస్తున్న పన్నుల భారం ఇది. అమెరికా సైనిక దళాల వరుస దాడులతో ఐఎస్ ఉగ్రవాదులు ఆర్థికంగా పూర్తిగా చితికిపోయారు. వాళ్ల ఆధీనంలోని ప్రాంతాలు, చమురు క్షేత్రాలు కూడా తగ్గుముఖం పట్టాయి. దీంతో ఉగ్రవాదులు ఆదాయం కోసం కొత్త మార్గాలు అన్వేషిస్తున్నారు. ఇరాక్, సిరియాలోని తమ పాలిత ప్రాంతాల ప్రజలపై ఆరు నెలల నుంచి పన్నులను భారీగా పెంచేశారు. కొత్త పన్నులు విధించారు. పురుషులు గడ్డాన్ని పూర్తిగా తొలగిస్తే 100 డాలర్లు, ట్రిమ్మింగ్ చేస్తే 50 డాలర్ల జరిమానా చెల్లించాలంటున్నారు. పురుషులు సాంప్రదాయకమైన పొడవైన, వదులైన దుస్తులు ధరించకుంటే 5 డాలర్లు ఫైన్ కట్టాలి. మహిళలు శరీర భాగాలు కనిపించేట్లు బిగుతైన దుస్తులు ధరిస్తే 25 డాలర్లు, కళ్లు కనబడేట్లు ధరిస్తే 10 డాలర్లు లేదా ఒక గ్రాము 24 క్యారెట్ల బంగారం జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. మహిళలు సాక్సులు లేదా గ్లోవ్స్ ధరించకుండా బయటికెళ్తే 30 డాలర్లు చెల్లించాల్సిందే. సిగరెట్ల ప్యాకెట్ పురుషుల వద్ద లభిస్తే 46 డాలర్లు, మహిళల వద్ద లభిస్తే 23 డాలర్ల జరిమానా కట్టాల్సి ఉంటుంది. చెక్ పాయింట్ల వద్ద నుంచి వెళ్లే ట్రక్కులు ఇకనుంచి 600-700 డాలర్ల పన్ను కట్టాలి. గతంలో ఇది 300 డాలర్లు మాత్రమే ఉండేది. ఇరాక్, సిరియా ప్రభుత్వాల్లో గతంలో పనిచేసిన భద్రతా సిబ్బంది, ఉద్యోగులు ఐఎస్ ఉగ్రవాదుల నుంచి పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ సర్టిఫికెట్ పొందాలంటే తగిన రుసుము చెల్లించాల్సిందే. సున్నీ తెగకు చెందని ముస్లింల నుంచి జిజియా పన్నును సైతం ఉగ్రవాదులు వసూలు చేస్తున్నారు. అయినా ఐఎస్ ఆధీనంలోని పరిధి తగ్గిపోవడంతో పన్నుల రూపంలో వచ్చే ఆదాయం 23 శాతం తగ్గింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఉగ్రవాదులు విధించే శారీరక శిక్షను డబ్బులు చెల్లించడం ద్వారా తప్పించుకోవచ్చు. అంతేకాదు.. ఐఎస్ ఉగ్రవాదులు వివిధ ప్రాంతాలపై దాడులు చేసి అపహరించిన మహిళలను, యువతులను సెక్స్ బానిసలుగా చేసుకున్నారు. ఇప్పుడు తిండి, వైద్యం ఖర్చులు భరించే పరిస్థితి లేకపోవడంతో సెక్స్ బానిసలను ఫేస్‌బుక్ ద్వారా విక్రయిస్తున్నారు. ఇటీవల 18 ఏళ్ల ఇద్దరు యువతులను ఓ ఉగ్రవాది ఫేస్‌బుక్‌లో 8 వేల డాలర్లకు అమ్మకానికి పెట్టాడు. పాలిపోయి, నీరసించి ఉన్న ఆ యువతుల ఫొటోలు కూడా పెట్టాడు. ఇలాంటి విక్రయాలు ఐఎస్ ఆధీనంలోని సిరియా, ఇరాక్‌లలో భారీగా జరుగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ముస్లిమేతరులు, యజీదీ మహిళలను సెక్స్ బానిసలుగా చేసుకోవడం, ఒక ఉగ్రవాది మరో ఉగ్రవాదికి విక్రయించడం నిత్యకృత్యంగా మారింది. ఒక్కో మహిళను వారి డిమాండ్‌ను బట్టి ఒక్కో ధరకు విక్రయిస్తున్నారు. అయితే వీళ్ల ఫొటోలను ఫేస్‌బుక్ యాజమాన్యం ఎప్పటికప్పుడు తొలగించేస్తోంది. విశేషమేమిటంటే ఉగ్రవాదులు అమెరికా ఆధీనంలోని ఫేస్‌బుక్, ట్విటర్ వంటి సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు. తమ భావజాలాన్ని ప్రచారం చేయడం, యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించడం వంటి వాటికి సోషల్ మీడియానే వారికి ప్రధాన ఆయుధంగా మారింది.

# చిత్రభాను

## ప్రేమకథలు నాకు నచ్చవు



కథానాయికగా అన్ని ప్రేమకథలే నన్ను వెతుక్కుంటూ వస్తున్నాయి.

మహిళా ప్రధాన ఇతివృత్తాల్లో నాకు నటించాలని ఉంది. అలాంటి కథల కోసం ఎదురుచూస్తున్నాను. మంచి కథ, దర్శకుడు లభిస్తే తప్పకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమా చేస్తాను అని చెప్పింది లావణ్య త్రిపాఠి. ఆమె కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం ఉన్నది ఒకటే జిందగీ. రామ్ కథానాయకుడు. కిషోర్ తిరుమల దర్శకుడు. ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో లావణ్యత్రిపాఠి పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి..

**నా హృదయానికి బాగా దగ్గరైన సినిమా ఇదని ఆడియో వేడుకలో చెప్పారు. అంతగా మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలేవి?**

-ఇందులో నా పాత్ర పేరు మ్యాగీ. అమాయకత్వంతో పాటు సెన్సాఫ్‌హ్యూమర్ ఎక్కువే. తొందరపాటు నిర్ణయాలతో తప్పులు చేసే అమ్మాయిగా నా పాత్రను దర్శకుడు విభిన్నంగా తీర్చిదిద్దారు. నిజజీవితానికి దగ్గరగా ఉంటుంది.

**ఇప్పటివరకు చాలా ప్రేమకథల్లో నటించారు. వాటితో పోలిస్తే ఈ సినిమా ఎంతవరకు వైవిధ్యంగా ఉంటుంది?**

-రియలిస్టిక్‌గా సాగే ప్రేమకథా చిత్రమిది. నేటితరం మనోభావాలకు ప్రతిరూపంగా ఉంటుంది. ప్రస్తుత జనరేషన్‌లో యువతీయువకులు ఎలా ప్రేమలో పడుతున్నారు? ప్రేమ పట్ల వారి ఆలోచనల తీరు ఎలా ఉంటుందనే అంశాన్ని దర్శకుడు కిషోర్ తిరుమల సహజంగా ఆవిష్కరించారు. ఆలస్యమైనా జీవితం మళ్లీ మళ్లీ అవకాశాల్ని ఇస్తూనే ఉంటుంది. నిరాశనిస్పృహలకు లోనుకాకుండా జీవితంలోని ప్రతి క్షణాన్ని ఎంజాయ్ చేయాలన్నదే చిత్ర ఇతివృత్తం.

**ఇందులో మీ పాత్ర నిడివి తక్కువగా ఉంటుందనే ప్రచారం జరుగుతున్నది?**

-నేను చెప్పడం కంటే తెరపై చూస్తేనే అందులో నిజమేమిటో అవగతమవుతుంది. నిడివితో సంబంధం లేకుండా నాతో పాటు అనుపమ పరమేశ్వరన్ పాత్రలకు సమాన ప్రాధాన్యత ఉంటుంది. పోటీని గురించి నేనెప్పుడు ఆలోచించను. సినిమా బాగా రావడానికే కష్టపడతాను. అనుపమ పరమేశ్వరన్ అంటే నాకు చాలా ఇష్టం. మంచి నటనను కనబరచింది.

**బాలీవుడ్‌లో మహిళలపై జరుగుతున్న దాడుల గురించి మీ టూ పేరుతో సోషల్‌మీడియాలో ఓ క్యాంపెయిన్ జరుగుతున్నది. దానిపై మీరేమంటారు?**

-ఆ క్యాంపెయిన్ గురించి నాకు పెద్దగా అవగాహన లేదు. సోషల్‌మీడియాలో మహిళల సమస్యల్ని చర్చించినంత మాత్రాన వాటికి పరిష్కారం దొరుకుతుందని, మార్పు వస్తుందని అనుకోవడం లేదు. ఒకరి స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికి లేదు. తమకు జరిగిన అన్యాయంపై ఎవరికివారే ధైర్యంగా పోరాడాలి. అప్పుడే మహిళలపై జరుగుతున్న దాడులు కొంతైనా తగ్గుతాయని అనుకుంటున్నాను.

**చాలా మంది కథానాయికలు నటనతో పాటు సొంతంగా వ్యాపారాల్ని మొదలుపెడుతున్నారు. మీకు ఆ ఆలోచన ఉందా?**

-సొంత వ్యాపారానికి సంబంధించి నా మనసులో కొన్ని ఆలోచనలు ఉన్నాయి. ఫుడ్, ఫిటినెస్, హ్యాండ్లూమ్స్‌కు నేను ఎక్కువగా ప్రాముఖ్యతనిస్తాను. వాటికి సంబంధించిన వ్యాపారాన్ని ప్రారంభించాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం సినిమాలతో బిజీగా ఉన్నాను. ఇప్పుడే వ్యాపారం గురించి ఆలోచించడం లేదు.

**తదుపరి సినిమా విశేషాలేమిటి?**

-వి.వి.వినాయక్, సాయిధరమ్‌తేజ్ సినిమాలో నటిస్తున్నాను. భవిష్యత్తులో వినూత్న కథా చిత్రాల్లో నటించాలనే ఆలోచనతో వున్నాను.

**హారర్ సినిమాల్లో అవకాశం వస్తే నటిస్తారా?**

-హారర్ నా ఫెవరేట్ జోనర్. ఈ తరహా కథాంశాలతో తెరకెక్కిన సినిమాల్ని ఎక్కువగా చూస్తుంటాను. కానీ వాటిలో మాత్రం నటించను. దయ్యం పాత్రలో నన్ను నేను ఊహించుకోలేను. ప్రేక్షకులు నన్ను అలాంటి పాత్రల్లో స్వీకరించరని నా భావన. అలాగే ప్రేమకథలు నాకు నచ్చవు. అలాంటి సినిమాల్ని చూడను. కాని

## ఉత్తుంగ తరంగమై..



సంకల్పబలం తోడుగా లక్ష్యశుద్ధితో వేసే ప్రతి అడుగు మనల్ని శిఖరాగ్రానికి చేరుస్తుంది. గుండెలనిండుగా ఆత్మవిశ్వాసం వుంటే విజయం నీ పాదాక్రాంతమవుతుంది. సవాలుకే సవాలు విసిరే తెగువే నవ చరితకు నాంది పలుకుతుంది. ప్రభాస్ సినీ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఈ విషయం ప్రస్ఫుటమవుతుంది. ఈశ్వర్ సినిమాతో ఓ చిరుజల్లులా మొదలైన ఆయన సినీప్రయాణం బాహుబలి చిత్రంతో ఉత్తుంగ తరంగమై ఎగిసిపడింది. ఇప్పుడు ప్రభాస్ పేరు భారతీయ సినీ ప్రియులకు సుపరిచితం. బాహుబలి కథానాయకుడిగా ఆయన దేశవ్యాప్తంగా తిరుగులేని గుర్తింపును సంపాదించుకున్నాడు. బాహుబలి చిత్రాన్ని చేయ సంకల్పించడం ప్రభాస్ సినీ గమనాన్నే మార్చివేసింది. ఒక్క సినిమా ఆయనకు జీవితకాలపు కీర్తిని తీసుకొచ్చిందనడం ఏమాత్రం అతిశయోక్తికాదు. అయితే బాహుబలి అఖండ విజయం ఆయాచితంగా లభించింది కాదు. నాలుగేళ్ల సుదీర్ఘ శ్రమ, నిరీక్షణకు దక్కిన మహాఫలమది. ఓ అగ్రహీరో నాలుగేళ్ల విలువైన తన కెరీర్‌ను ఒక్క సినిమాకే కేటాయించడం వృత్తిపట్ల నిబద్ధతకు తార్కాణంగా చెప్పవచ్చు. ఇదిలావుంటే బాహుబలి సక్సెస్ ప్రభాస్ వ్యక్తిత్వాన్ని ఇసుమంతైనా మార్చలేదు. విజయం వినయంగా ఆయన చిరునవ్వులో ఒదిగిపోయింది. తెరపైన బాహుబలిగా భాసిల్లిన ఆయన శ్రేయోభిలాషుల హృదయాల్లో మాత్రం ఇప్పటికి డార్లింగ్‌గానే కొలువైవున్నాడు. ప్రస్తుతం ప్రభాస్ సాహో చిత్రంలో నటిస్తున్నారు. సుజిత్ దర్శకుడు. హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది.




## ఆయన పిలిస్తే వెళ్ళిపోతా

అనుపమా పరమేశ్వరన్ ఈ మధ్య కాలంలో మలయాళీ భామల దండయాత్రలో తెలుగు ప్రేక్షకులని జయించిన అందాల భామల్లో అనుపమా ఒకరు. కళ్ళతోనే చంపేస్తుందా అన్నంత అందమైన లుక్స్ తో అడుగుపెడ్తూనే సైలెంట్ గా వరుస హిట్లు తన ఖాతాలో వేసుకుందీ మళయాలీ అందం.తెలుగులో 'అనుపమ పరమేశ్వరన్' హవా సాగేలా కనిపిస్తోంది. 'అ ఆ' సినిమాలో చేసింది చిన్న పాత్రే అయిన ఈ కేరళ బ్యూటీ అందరి దృష్టిని తనవైపుకు తిప్పుకుంది. ఆ వెంటనే 'నాగచైతన్య' తో ప్రేమమ్ రీమేక్ లో నటించి తెలుగు యూత్ కి మరింత దగ్గరైంది. ఇక 'శర్వానంద్' తో నటించిన 'శతమానం భవతి' ఇలా ప్రతీ సినిమాకీ తానొక గోల్డెన్ లెగ్ అయిపోయింది. ఈమధ్యనే ఒక టాక్ లో మాట్లాడిన ఈ అమ్మడు తనకు ఎవరితో చేయాలని కోరిక ఉందో చెబుతూ.. ముందు రాజమౌళి గారి సినిమాలో చిన్న సీన్ అయినా చేయాలని ఉన్నట్లు చెప్పింది. తరువాత మాత్రం షాకిచ్చింది. ''నేను మొన్న ఖైదీ నెం 150 చూశాను. అసలు చిరంజీవి సార్ 150 సినిమాలు చేశారంటే షాకింగ్ గా ఉంది. పైగా ఆ వయస్సులో ఆయన డ్యాన్స్ అండ్ ఎనర్జీ చూస్తే పిచ్చెక్కిపోయింది. అందుకే ఆయన సినిమాలో ఒక నిమిషం నిడివి ఉన్న చిన్న పాత్రను చేయడానికి అయినా రెడీ. ఆయన పిలిస్తే వెళిపోతా'' అంటూ సెలవిచ్చింది అనుపమ. మరి హీరోయిన్ గా చేస్తుందో లేదో తెలియదు కాని.. చిరంజీవి సినిమాలో పాత్ర కావాలంటూ ఓపెన్ గా చెప్పేసింది. ఇలాంటి సమయం లో అనుపమా లాంటి అమ్మాయిల అవసరం ఎంతైనా ఉంది. మరి ఈ విశయం రామ్ చరణ్ చెవిన పడిందో లేదో ఎటూ ఇప్పుడు సైరా నరసింహా రెడ్డి కోసం కూడా చిరు పక్కన ఒక హీరోయిన్ కావాలి కదా... చూస్తుంటే 'సైరా' సినిమా కోసం ఏదన్నా రిక్వయిర్మెంట్ ఉంటే వెంటనే రామ్ చరణ్ ఈమెకు కబురంపితే బెటరేమో అనిపిస్తోంది కదూ.

## బేవర్స్ హంగామా

సంజోష్, హర్షిత నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం బేవర్స్. పొన్నాల చందు, ఎమ్. అరవింద్ నిర్మిస్తున్నారు. రమేష్ చెప్పాల దర్శకుడు. రాజేంద్రప్రసాద్ కీలక పాత్రధారి. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నిర్మాతలు మాట్లాడుతూ తండ్రీకొడుకుల అనుబంధంతో తెరకెక్కుతున్న మాస్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. తండ్రి దృష్టిలో బేవర్స్‌గా ముద్రపడిన ఓ యువకుడు ఎలా గొప్పవాడయ్యాడు? అందుకు దారి తీసిన పరిస్థితులేమిటన్నది ఆసక్తికరంగా ఉంటుంది. ఇటీవలే హైదరాబాద్‌లో చిత్రీకరించిన మాస్ గీతంతో షుటింగ్ పూర్తయింది. రాజేంద్రప్రసాద్ పాత్రచిత్రణ, నటన సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి.

ఇంటిల్లిపాదిని అలరించే చిత్రమిది అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, సాహిత్యం: సుద్దాల అశోక్‌తేజ, భాస్కరభట్ల, అరవింద్, కెమెరా: కె.చిట్టిబాబు.



## సందేశంతో రుణం

గోపీకృష్ణ, మహేంద్ర, శిల్ప, ప్రియాంక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం రుణం. ఎస్. గుండ్రెడ్డి దర్శకుడు. భీమినేని సురేష్, జి.రామకృష్ణారావు నిర్మాతలు. ఇటీవల హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైందీ చిత్రం. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ అత్యాశ వలన కలిగే అనర్థాల్ని ఆవిష్కరించే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేస్తూ తెరకెక్కిస్తున్నాం. సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తిచేస్తాం అని అన్నారు. మానవ సంబంధాలపై ఆర్థిక విలువలు ఎలా ఆధిపత్యం చెలాయిస్తున్నాయనే పాయింట్‌తో వినోదభరితంగా ఈ సినిమాను రూపొందిస్తున్నామని, కథాబలమున్న మంచి సినిమాగా అందరిని అలరిస్తుందనే నమ్మకముందని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెంకట్.



# పేలిన జియో ఫోన్!




ముంబై: సంచలనం సృష్టించిన రిలయెన్స్ జియో ఫీచర్ ఫోన్ చార్జింగ్ పెడుతుండగా పేలినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఈ విషయాన్ని ఓ ట్విట్టర్ యూజర్ తన అకౌంట్ ద్వారా వెల్లడించాడు. అయితే ఈ ఘటన జరిగినట్లు తమకు తెలుసని, కావాలనే సదరు కస్టమర్ ఇలా చేసినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందని రిలయెన్స్ వివరణ ఇచ్చింది. నెల రోజులుగా తమ 60 లక్షల మంది కస్టమర్లకు జియో ఫోన్లను రిలయెన్స్ అందిస్తున్నది. అయితే బ్యాటరీ పేలుడు ఘటన మాత్రం ఇదే తొలిసారి. కశ్మీర్‌లో ఈ ఘటన జరిగినట్లు టెక్ బ్లాగ్ ఫోన్ రాడార్ రిపోర్ట్ చేసింది. అయితే ఈ ఫోన్ పేలుడుకు సంబంధించి ఫొటోను ట్వీట్ చేసిన సదరు నెటిజన్.. తర్వాత దానిని డిలిట్ చేశాడు. ఈ పేలుడులో ఫోన్ వెనుక భాగం పూర్తిగా పాడైపోగా.. ముందు భాగం మాత్రం చెక్కు చెదరనట్లు ఫొటోలు స్పష్టంగా కనిపిస్తున్నది. అయితే ఈ పేలుడు తర్వాత కూడా బ్యాటరీ పనిచేస్తున్నట్లు ఈ ఫోన్‌ను చెక్ చేసిన లైఫ్ డిస్ట్రిబ్యూటర్ చెప్పాడు.

ఈ ఘటనపై రిలయెన్స్ వెంటనే స్పందించింది. ఆ సంస్థ ప్రతినిధి వివరణ ఇచ్చారు. జియో ఫోన్లను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో తయారు చేయించాం. ప్రతి ఫోన్‌ను క్వాలిటీ టెస్ట్ చేయించాం. పేలుడు ఘటన గురించి మాకు తెలిసింది. అయితే అది కావాలనే చేసినట్లు మా విచారణలో తేలింది. జియో బ్రాండ్‌ను దెబ్బ తీయాలన్న ఉద్దేశంతో కొందరు కావాలనే ఈ పని చేశారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం అని ఆ ప్రతినిధి స్పష్టంచేశారు.

జీరో ఎఫెక్టివ్ ప్రైస్ అంటూ 1500 డిపాజిట్‌తో జియో ఫీచర్ ఫోన్లను కస్టమర్లకు అందిస్తున్నది రిలయెన్స్. స్మార్ట్‌ఫోన్‌లాంటి ఫీచర్లతో ఇప్పటికే జియో ఫోన్‌కు పాజిటివ్ రీవ్యూలు వచ్చాయి. ఈ ఫోన్‌కు పోటీగా కార్బన్‌తో చేతులు కలిపి ఎయిర్‌టెల్ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను, మైక్రోమ్యాక్స్‌తో కలిపి బీఎస్ఎన్ఎల్ భారత్-1 4జీ ఫీచర్ ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చాయి.

# మొక్కుబడిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ: ఆర్.కృష్ణయ్య



నల్లకుంట: రాష్ట్రంలో మొత్తం 40 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే మొక్కుబడిగా ప్రభుత్వం 8792 మాత్రమే భర్తీ చేసి చేతులు దులుపుకోవాలనుకుంటోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య మండిపడ్డారు. 2012 నుంచి ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ నిరుద్యోగ సంఘాల ఐకాస ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన విద్యార్థి, నిరుద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టులతోపాటు నాలుగు వేల కంప్యూటర్, మూడు వేల పీఈటీ, రెండు వేల క్రాఫ్ట్, డ్రాయింగ్, మూడు వేల లైబ్రేరియన్, నాలుగు వేల జూనియర్ అసిస్టెంటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 4500, ఆదర్శ పాఠశాల్లో రెండు వేలు, కస్తూర్బా పాఠశాలల్లో 1200 పోస్టులను కూడా భర్తీ చేయాలన్నారు. తెలంగాణ నిరుద్యోగ సంఘాల ఐకాస ఛైర్మన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నేతలు భూపేష్‌సాగర్, మహేందర్‌గౌడ్, సతీష్, కృష్ణయాదవ్, అనంతయ్య, శ్రీనివాస్‌గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# 110 కోట్ల మందికి గుర్తింపే లేదు

## ఇక్కడా మనమే ఫస్ట్?



వాషింగ్టన్: ప్రపంచ వ్యాప్తంగా ఏ గుర్తింపునకూ నోచుకోని వారి సంఖ్య ఎంతో తెలుసా? అక్షరాలా 110 కోట్లు. వీరిలో మూడో వంతు చిన్నారులే ఉన్నారట. విచిత్రమేమిటంటే.. 21 కోట్ల మందితో మన దేశం ఈ జాబితాలో ప్రథమ స్థానంలో ఉండడం. వరల్డ్ బ్యాంక్‌కు చెందిన ఐడెంటిఫికేషన్ ఫర్ డెవలప్‌మెంట్ (ఐడీ4డీ) కార్యక్రమం చేపట్టిన సర్వే వివరాలు చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. మన దేశ జనాభాలో దాదాపు 16 శాతం మందికి నేటికీ ఏ గుర్తింపూ లేదట. ఆధార్ కార్డు.. ఓటర్ ఐడీ.. రేషన్‌కార్డు.. పాస్‌పోర్ట్.. డ్రైవింగ్ లైసెన్స్.. ఇలాంటివన్నీ అధికారికంగా మన అస్తిత్వాన్ని నిరూపించే గుర్తింపు కార్డులు. వీటిని ఒక్కో దేశంలో ఒక్కోవిధంగా పిలుస్తుంటారు. ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు మనకు చేరాలంటే గుర్తింపు కార్డు తప్పనిసరి. మరి వీటిలో ఒక్కటీ లేకుంటే? మనిషిగా పుట్టి, పెరుగుతున్నా ప్రభుత్వానికి తెలియకుంటే?.. వారంతా గుర్తింపులేని వ్యక్తుల కిందే లెక్క.

ఏ గుర్తింపు కార్డు లేని వ్యక్తులు మనదేశంలో 21 కోట్ల మంది ఉన్నారట. అంటే మన జనాభాలో దాదాపు 16 శాతం మంది. ఇక మన దాయాది దేశం పాకిస్తాన్ లో అయితే 42.5 శాతం మంది గుర్తింపు లేకుండా బతికేస్తున్నారు. నైజీరియాలో ఏకంగా 77 శాతం మంది జనాభాకు గుర్తింపు కార్డులే లేవట. వరల్డ్ బ్యాంక్‌కు చెందిన ఐడెంటిఫికేషన్ ఫర్ డెవలప్‌మెంట్ (ఐడీ4డీ) కార్యక్రమం చేపట్టిన సర్వే వెల్లడించిన కఠోర సత్యాలివి. ప్రపంచవ్యాప్తంగా ఏ గుర్తింపునకూ నోచుకోనివారు 110 కోట్ల మంది ఉండగా, వారిలో మూడోవంతు చిన్నారులే. ఈ జాబితాలో మన భారత దేశం మొదటిస్థానంలో ఉండడం గమనార్హం.

# డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ పూర్తి



అమీర్‌పేట: ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో డిజిటల్ మార్కెటింగ్ కోర్సులో శిక్షణ పూర్తి చేసిన వారికి ఆదివారం ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలోని ఈనాడు ఈవెంట్స్(కలోరమ ప్రింటర్స్) కార్యాలయం ఆవరణలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. అంతకుముందు నిపుణులు జావెద్ డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ అమ్మకాల అంశాలపై అవగాహన కల్పించారు. డిజిటల్ మార్కెటింగ్ తీరుతెన్నులు, ప్రత్యేకంగా వెబ్‌సైట్ రూపొందించడం, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్, సెర్చ్ ఇంజన్ మార్కెటింగ్, మొబైల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ డిస్‌ప్లే అడ్వర్టై%జింగ్, యూట్యూబ్ అడ్వర్టై%జింగ్, ఈ కామర్స్-షాపింగ్ అడ్వర్టై%జింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇ-మెయిల్ మార్కెటింగ్, కంటెంట్ మార్కెటింగ్, గూగుల్ అనలిటిక్స్, గూగుల్ యాడ్‌సెన్స్, మార్కెటింగ్, ఎర్నింగ్ త్రో ఫ్రీలాన్స్ ప్రాజెక్ట్స్, ఆన్‌లైన్ రెప్యుటేషన్ మేనేజ్‌మెంట్, గూగుల్ సర్టిఫికేషన్ శిక్షణ తదితర అంశాలను వివరించారు. ఆన్‌లైన్ ద్వారా అమ్మకం, కొనుగోలు మాత్రమే కాకుండా ఈ రంగంలో ఉపాధికి గల అవకాశాలు, వాటిని అందిపుచ్చుకోవడంలో మెలకువలను వివరించారు.

క్లబ్ ఆధ్వర్యంలో కొనసాగిన ఫొటోగ్రఫీ కోర్సులో శిక్షణ కార్యక్రమం ముగిసింది. శిక్షణపూర్తి చేసిన వారు బేగంపేట రైల్వేస్టేషన్ సమీపంలోని కలోరమ ప్రింటర్స్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమం ద్వారా ధ్రువపత్రాలు అందుకున్నారు. అంతకుముందు నిపుణులు వంశీకృష్ణ ఫొటోగ్రఫీ కార్యశాల(వర్క్‌షాప్) ద్వారా పలు అంశాలపై శిక్షణనిచ్చారు. కెమెరా పనితీరు, లెన్స్‌ల అమరిక, కెమెరా వాడే విధానం, అందమైన దృశ్యాలను తీసే విధానాలతో పాటు ప్రాథమిక అంశాల్లో అవగాహన కల్పించారు. క్రియేటివ్ జోన్, ప్రోగ్రామింగ్ మోడ్, షట్టర్, మాన్యువల్ సిస్టమ్స్‌పై సాంకేతిక అంశాలను వివరించారు. స్టిల్ ఫొటోగ్రఫీ, అవుట్‌డోర్, ఇండోర్ విధానాల్లో చిత్రాలు తీయడంలో మెలకువలను నేర్పించారు. శిక్షణ పూర్తి చేసిన వారు తమ కెమెరాల పనితీరును తెలుసుకోవడంతో పాటు అందంగా చిత్రాలు తీసి చూపించారు.

# గడ్డిఅన్నవరం క్షేత్రంలో కార్తీక శోభ



దిల్‌సుఖ్‌నగర్: కార్తీకమాసం పురస్కరించుకుని దిల్‌సుఖ్‌నగర్‌లోని పలు ఆలయాల్లో సత్యనారాయణ స్వామివారి వ్రతాలు, ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి.

లలితానగర్‌లోని గడ్డిఅన్నవరం క్షేత్రంలో భక్తులు సత్యనారాయణ స్వామివారి వ్రతాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

దిల్‌సుఖ్‌నగర్ కోదండరామనగర్‌లోని శ్రీఅలివేలు మంగాసమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా ఆకాశదీపం వెలిగించారు.

# 39 మంది భార్యలు, 181 మంది కుటుంబ సభ్యులు



ఐజాల్ : అది మిజోరమ్ రాష్ట్రంలోని బక్తావంగ్ గ్రామం. ఆ గ్రామంలో నాలుగంతస్తుల భవనం. అందులో వందగదులు ఉన్నాయి. వాటిల్లో 181 మంది నివసిస్తున్నారు. వారంతా ఒకటే కుటుంబం సభ్యులంటే ఆశ్చర్యం వేస్తోంది. అవును ప్రపంచంలోనే అతి పెద్ద కుటుంబంగా ఘనతి కెక్కిన 72 ఏళ్ల జియోనా కుటుంబం ఈ భవనంలోనే నివసిస్తోంది.


ఆయనకు 39 మంది భార్యల ద్వారా 94 మంది పిల్లలు పుట్టారు. ఆయనకు 14 మంది కోడళ్లు, 40 మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. ఒక్క కుటుంబంలోని నలుగురు వ్యక్తులే కలసి మెలసి ఉండని ఈ రోజుల్లో ఏకంగా ఇంతమంది భార్యలు, పిల్లలు, వారి పిల్లల పిల్లలు, కలసిమెలసియే కాకుండా ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవిస్తున్నారు. వారంతా వంటావార్పు కలసే చేసుకుంటారు. రోజుకు ఆ భారీ కుటుంబానికి 50 కిలోల బియ్యం, 70 కిలోల మాంసం కావాలట. జియోనా పుట్టుకతోని ధనవంతుడు అవడం వల్ల అంత మందిని ధైర్యంగా పెళ్లి చేసుకున్నారు.

వయస్సులో ఉండగా అందరి పోషణ బాధ్యత ఆయనే చూసుకోగా, ఇప్పుడు కుటుంబం పోషణకు కుటుంబంలోని సభ్యులంతా తలా ఓ చేయి వేస్తున్నారు.

జియోనా కుటుంబానికి సంబంధించిన ఫొటోలు ఇదివరకే వెలుగులోకి రాగా, ఇప్పుడు ఆయన కుటుంబానికి సంబంధించిన ఓ వీడియో వెలుగులోకి వచ్చింది.

### 46 ఏళ్ల తర్వాత టీమిండియాలో

# మన ఫాస్ట్ బౌలర్..



హైదరాబాద్ : టీమిండియా జట్టుకు హైదరాబాదీ ఫాస్ట్ బౌలర్లు ఎప్పుడు ఆడారో తెలుసా. మొహమ్మద్ సిరాజ్ తాజాగా న్యూజిలాండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన విషయం తెలిసిందే. కానీ చివరిసారి టీమిండియాకు ఆడిన హైదరాబాద్ ఫాస్ట్ బౌలర్ గోవిందరాజ్. మాజీ పేసర్ గోవిందరాజ్.. 1971లో వెస్టిండీస్ టూర్‌కు వెళ్లాడు. మళ్లీ 46 ఏళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు సిరాజ్ ఎంపిక కావడం విశేషం. హైదరాబాద్ సన్‌రైజర్స్ తరపున గత సీజన్‌లో స్పీడ్ బౌలర్‌గా సిరాజ్ అద్భుతంగా రాణించాడు. అక్కడే అతను అందర్నీ అట్రాక్ట్ చేశాడు. సన్‌రైజర్స్ కెప్టెన్ డేవిడ్ వార్నర్ కూడా సిరాజ్ బౌలింగ్ స్టయిల్‌ను మెచ్చుకున్నాడు. కీలకమైన మ్యాచుల్లో సిరాజ్ చాలా చాకచక్యంగా బౌలింగ్ చేశాడు. సిరాజ్ ఓ నాణ్యమైన బౌలర్ అని, కొత్త బంతితో కానీ.. చివరి ఓవర్లలోనూ అతను మెరుగ్గా బౌలింగ్ చేస్తాడని వార్నర్ మన హైదరాబాదీపై ప్రశంసలకు కురిపించాడు.

సన్‌రైజర్స్ టీమ్‌కు మెంటర్‌గా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్‌ను కూడా సిరాజ్ బౌలింగ్ అమితంగా ఆకట్టుకున్నది. వార్నర్, లక్ష్మణ్ సూచలనలు, సలహాలతో సిరాజ్ ఐపీఎల్‌లో రాటు తేలాడు. మంచి బౌలర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు.

23 ఏళ్ల సిరాజ్ గత ఏడాది రంజీ సీజన్‌లో మొత్తం 41 వికెట్లు తీసుకుని మూడవ అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు.

వాస్తవానికి సన్‌రైజర్స్ టీమ్‌కు 2.6 కోట్లకు ఎంపికై అందర్నీ స్టన్ చేశాడు. సిరాజ్ బౌలింగ్‌లో పేస్ ఉందని, డొమెస్టిక్ సీజన్ కూడా అద్భుతంగా ఉందని, అతను మనసు పెట్టి అన్నీ నేర్చుకుంటున్నాడని, అదో మంచి సంకేతమని వార్నర్ ఇటీవల తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ప్రస్తుతం భారత బౌలింగ్ కోచ్‌గా ఉన్న భరత్ అరుణ్ నుంచి కూడా సిరాజ్ చాలా నేర్చుకున్నాడు.

గత ఏడాది భరత్ అరుణ్.. హైదరాబాద్ టీమ్‌కు బౌలింగ్ కోచ్‌గా ఉన్నాడు. వికెట్ టేకింగ్ బౌలర్‌గా తనను మార్చింది కోచ్ భరత్ అని సిరాజ్ కూడా చెబుతుంటాడు. యార్కర్లు, ఇన్‌స్వింగర్లు ఎలా వేయాలో అరుణ్ నేర్పాడన్నాడు.

ఇన్ స్వింగర్, డిసెప్టివ్ బౌన్సర్లు వేయడంలో సిరాజ్ మేటి అని కోచ్ అరుణ్ తెలిపాడు. సిరాజ్ ఒక్కొక్కసారి 140 వేగంతోనూ బంతులు వేయగలడన్నాడు. బౌలింగ్ కోచ్ అరుణ్ చేతిలో సిరాజ్ మరింత పదునెక్కే అవకాశాలున్నాయి.

### స్వచ్ఛతా హీ సేవలో

# సీఐఎస్ఎఫ్ బలగాలు



శంషాబాద్: ఏకే47 ఆయుధాలను భుజాన వేసుకొని డేగ కళ్లతో విమానాశ్రయంలో రేయింబవళ్లు పహారా కాసే కేంద్ర పారిశ్రామిక భద్రత బలగాలు ఆయుధాలను పక్కన పెట్టి చీపురు కట్టలను చేతపట్టి పారిశుద్ధ్యం పనుల్లో నిమగ్నమయ్యారు.ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు నిచ్చిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ విమానాశ్రయం యూనిట్ భద్రతాధికారులు పాల్గొన్నారు. సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సుధీర్‌కుమార్ అధ్యర్యంలో మామిడిపల్లి, విమానాశ్రయంలోని చిన్మయ పాఠశాల, జీఎమ్మార్‌వీఎఫ్, సీఐఎస్ఎఫ్ నివాస సముదాయాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. పాలిథిన్ కవర్ల వినియోగాన్ని నివారించి నిత్యం వెలువడుతున్న వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.డిప్యూటీ కమాండెంట్ రవికుమార్, ఇన్స్‌పెక్టర్స్ రాజేశ్, మన్మోహన్ పాల్గొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at **VIJAYABHANU PRESS**, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com